Website: www.subhatelangana.in

RNI-TELTEL/2017/72695

శనివారం
12 అక్టోబర్ 2024

ఎడిటర్:
నాగళ్ళ చంద్రశేఖర్

సంపుటి : 8
సంచిక : 156
పేజీలు : 6
వెల : 3/-

# శుభ తెలంగాణ

ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక

మేడ్చల్

Circulated at Hyderabad, Rangareddy, Warangal, Karimnagar, Khammam, Nalgonda, Nizambad, Medak, Adilabad, Mahaboobnagar



## భావితరాల భవిష్యత్ కోసమే
# హైడ్రా ఏర్పాటు

- మూసీ అభివృద్ధికి రూ. లక్షా యాభై వేల కోట్ల కేటాయించినట్లు వస్తున్న వార్తల్లో ఎక్కడా నిజం లేదు
- సురేఖను తప్పిస్తారని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్న పీసీసీ చీఫ్
- నాగార్జున, అక్కినేని కుటుంబంపై చేసిన వ్యాఖ్యలను ఆమె వెనక్కి తీసుకున్నారని వెల్లడి
- కొండా సురేఖ అలా మాట్లాడి ఉండాల్సింది కాదన్న మహేశ్ కుమార్ గౌడ్
- ఫిరోజ్‌ఖాన్‌పై మజ్లిస్ దాడి అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లామన్న పీసీసీ చీఫ్

హైదరాబాద్

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై విమర్శలు గుప్పిస్తున్న క్రమంలో హీరో అక్కినేని నాగార్జున కుటుంబంపై చేసిన వ్యాఖ్యలను తెలంగాణ అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ వెనక్కి తీసుకున్నారని పీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. - మిగతా3లో


## ప్రతి విద్యార్థికి
# నాణ్యమైన విద్య

- 5 వేల పాఠశాలలను మూసేసిన కేసీఆర్.. సీఎం రేవంత్ ఘాటు వ్యాఖ్యలు
- "దసరా నాలుగు కోట్ల ప్రజలకు సుఖ శాంతులు ఇవ్వాలని కోరుకుంటున్న
- ప్రభుత్వం ఏర్పడిన రోజునే వాగ్దానం చేశాం
- రాష్ట్రాన్ని విద్యా, వైద్య రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టేందుకు కృషి చేస్తాం
- దళితులకు, గిరిజనులకు విద్యను దూరం చేసేందుకు బీఆర్ఎస్ తన ప్రభుత్వ పాలనలో పాఠశాలలను మూసివేసింది
- ప్రతి బిడ్డ.. చదువుకొని ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే కోరిక
- సామాన్య, పేద కుటుంబాల విద్యార్థులకు నాణ్యమైన అందించేందుకు తాము నియోజకవర్గానికి ఒక స్కూల్.. 20 నుండి 25 ఎకరాలలో నిర్మిస్తున్నాం



శుభ తెలంగాణ హైదరాబాద్

బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 5 వేలకుపైగా పాఠశాలలను మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మూసేయించారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. షాద్‌నగర్ నియోజకవర్గం కొందుర్గులో శుక్రవారం రేవంత్ పర్యటించి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కొందుర్గులో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. "దసరా నాలుగు కోట్ల ప్రజలకు సుఖ శాంతులు ఇవ్వాలని కోరుకుంటున్న. ప్రభుత్వం ఏర్పడిన రోజునే - మిగతా3లో




పాఠకులకు..
శ్రేయోభిలాషులకు..
ప్రకటనకర్తలకు..
దసరా శుభాకాంక్షలు

## సెలవు

నేడు దసరా పండుగ సందర్భంగా కార్యాలయానికి సెలవు కావున ఆదివారం పత్రిక వెలువడదు పునర్దర్శనం సోమవారం.

## ఏపీకి నిధులు..
# తెలంగాణకు గుండు సున్నా



- కేంద్రంపై హరీశ్ ఫైర్
- గోదావరి పుష్కరాలకు ఏపీకి రూ. 100 కోట్లు ఇచ్చారన్న హరీశ్
- కేంద్ర బడ్జెట్ లో ప్రత్యేక నిధుల కింద రూ. 15 వేల కోట్లు ఇచ్చారని వ్యాఖ్య
- తెలంగాణకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని మండిపాటు
- తెలంగాణకు నిధులు తేవడంలో కాంగ్రెస్, బీజేపీ విఫలం : హరీశ్ రావు

శుభ తెలంగాణ హైదరాబాద్

తెలంగాణకు రావాల్సిన నిధుల కోసం పోరాడడంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఘోరంగా విఫలమయ్యాయని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. గోదావరి పుష్కరాలకు తెలంగాణకు కేంద్రం మొండి చెయ్యి చూపడంపై ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. గోదావరి పుష్కరాల కోసం కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కి రూ.100 కోట్ల నిధులు ఇచ్చింది.. కానీ తెలంగాణకు గుండు సున్న ఇచ్చింది. మన రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా.. ఒక్క రూపాయి కూడా కేంద్రం తెలంగాణకు ఇవ్వలేదని మండిపడ్డారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం మరోసారి గుండు సున్నా ఇచ్చిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి - మిగతా3లో



## టాటా ట్రస్ట్ చైర్మన్‌గా
# నోయల్

- టాటా ట్రస్ట్ చైర్మన్‌గా నోయెల్ టాటాకు ఆమోదం తెలిపిన ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు
- రతన్ టాటా సవతి తల్లి కొడుకే నోయెల్ టాటా
- 2000 ఆరంభంలో కంపెనీలోకి అడుగు
- నాటి నుంచి కంపెనీ ఎదుగుదలకు విశేషంగా కృషి చేస్తున్న నోయెల్ టాటా

## సీఎం రేవంత్ రెడ్డి ముందు దానికి
# సమాధానం చెప్పాలి

- రేవంత్ రెడ్డి మూసీ ప్రాంతంలో పర్యటించి కూల్చివేతలకు ఒప్పించాలి
- కిషన్ రెడ్డి డిమాండ్
- కూల్చివేతలు అంత ఈజీ కాదన్న కిషన్ రెడ్డి
- మూసీ రిటర్నింగ్ వాల్‌ను నిర్మించి కూడా సుందరీకరణ చేయవచ్చని వెల్లడి
- రేస్ కోర్స్ అమ్మి మరీ సుందరీకరణ పనులు అవసరం లేదన్న కేంద్రమంత్రి
- హైడ్రాకు గవర్నర్ చట్టబద్ధత కల్పించడం సాధారణ ప్రక్రియ
- బాధితులు ఎవరూ భయపడొద్దు
- మూసీ బాధితుల కోసం బీజేపీ పోరాటం చేస్తోంది




శుభ తెలంగాణ హైదరాబాద్

కూల్చివేతలు అంత ఈజీ కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా మూసీ ప్రాంతంలో పర్యటించి ప్రజలను ఒప్పించాలని కేంద్రమంత్రి, బీజేపీ నేత కిషన్ రెడ్డి అన్నారు. మూసీ పరీవాహక ప్రాంతంలో పేదల ఇళ్ల కూల్చివేత సరికాదన్నారు. ఇక్కడి పేదలకు బీజేపీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఇక్కడ నివసించే ప్రజలు ఎంతో కష్టపడి రూపాయి రూపాయి కూడబెట్టుకొని ఇళ్లను కొనుక్కున్నారని తెలిపారు. అలాంటి వాటిని కూల్చుడమేమిటన్నారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో పేదోళ్ల ఇళ్లు కూల్చుడాన్ని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి మరోసారి ఖండించారు. వారికి బీజేపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో ప్రజలు ఎంతో కష్టపడి చిన్నచిన్న - మిగతా3లో

## తహసీల్దార్ల బదిలీలకు
# గ్రీన్ సిగ్నల్

- గత కొంతకాలంగా ఎదురుచూస్తున్న చూపులకు తెర పడింది.
- తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ మొదటి నుంచి చేసిన కృషికి ఫలితం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితోపాటు సీసీఎల్ఏ నవీన్ మిట్టల్ వంటి ఉన్నతాధికారులను టీజీటీఏ అధికారులు ఇప్పటికే కలిశారు



శుభ తెలంగాణ హైదరాబాద్

ఎట్టకేలకు రాష్ట్రంలో తహసీల్దార్ల ఎన్నికల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల సమయంలో బదిలీ అయిన తహసీల్దార్లు తమ సొంత జిల్లాలకే తిరిగి వెళ్లిపోయే విధంగా అవకాశం కల్పించాలని తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ మొదటి నుంచి చేసిన కృషికి ఫలితం దక్కింది. దీంతో గత కొంతకాలంగా ఎదురుచూస్తున్న చూపులకు తెర పడింది. అయితే, ఇదే విషయాన్ని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితోపాటు సీసీఎల్ఏ నవీన్ మిట్టల్ వంటి ఉన్నతాధికారులను టీజీటీఏ అధికారులు - మిగతా3లో



## ప్రాణాలు తీసిన
# ఫైరింగ్ ప్రాక్టీస్

- గన్ మిస్‌ఫైర్ అయ్యి ఇద్దరు హైదరాబాదీలు మృతి
- దేశసేవ చేయాలని భావించిన వారు ఆ ఆశ తీరకుండానే అసువులు బాసారు.
- మృతులు విశ్వరాజ్ సింగ్ (20), సైఫట్ షిట్ (21) గా గుర్తింపు

## యుద్ధాలు చేసే యుగం ఇది కాదు



- యురేసియా, వెస్ట్ ఏషియాలో శాంతి స్థాపన జరగాలి
- యుద్ధ క్షేత్రాల నుంచి సమస్యలకు పరిష్కారాలు దొరకవు
- స్వేచ్ఛాయుత ఇండో పసిఫిక్ విధానాల వల్ల ఈ ప్రాంతంలో శాంతి నెలకొంటుంది
- దక్షిణ చైనా సముద్రంలో శాంతి, భద్రత, స్థిరత్వం వల్లే.. ఇండో పసిఫిక్ ప్రాంతంలో శాంతి ఉంటుంది
- చర్చలకు, దౌత్యానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలి
- ప్రధాని నరేంద్ర మోదీ

# యుద్ధాలు చేసే యుగం ఇది కాదు

**లావోస్:** ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధ, రాజకీయ సంక్షోభాల వల్ల.. దక్షిణాసియా దేశాలపై తీవ్ర ప్రభావం పడుతున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. యురేసియా, వెస్ట్ ఏషియా దేశాల్లో శాంతి, స్థిరత్వం నెలకొనాలని ఆయన ఆశించారు. లావోస్‌లో జరుగుతున్న 19వ ఈస్ట్ ఏసియా సమ్మిట్‌లో పాల్గొని ఆయన మాట్లాడారు. యుద్ధ క్షేత్రాల నుంచి సమస్యలకు పరిష్కారాలు దొరకవన్నారు. దక్షిణాసియా ప్రాంతంలో చైనా ప్రాబల్యాన్ని గురించి ప్రస్తావిస్తూ.. స్వేచ్ఛాయుత ఇండో పసిఫిక్ విధానాల వల్ల ఈ ప్రాంతంలో శాంతి నెలకొంటుందన్నారు. దక్షిణ చైనా సముద్రంలో శాంతి, భద్రత, స్థిరత్వం వల్లే.. ఇండో పసిఫిక్ ప్రాంతంలో శాంతి ఉంటుందన్నారు. సముద్ర కార్యకలాపాలన్నీ యూఎన్సీఎల్వోఎస్ కు అనుగుణంగా జరగాలని ఆయన కోరారు. నావిగేషన్, ఎయిర్‌స్పేస్‌పై స్వేచ్ఛ ఉండాలన్నారు. ప్రాంతీయ దేశాల విదేశీ విధానాలపై ఆంక్షలు ఉండవద్దు అన్నారు. అభివృద్ధిపై దృష్టి పెట్టాలని, కానీ విస్తరణపై కాదన్నారు. యుద్ధాలు జరుగుతున్న దేశాల వల్ల .. గ్లోబల్ సౌత్ ప్రాంతంపై ప్రభావం పడుతోందన్నారు. బుద్ధుడి పుట్టిన దేశం నుంచి వచ్చానని, యుద్ధాలు చేసే యుగం ఇది కాదన్నారు. యురేషియాతోపాటు పశ్చిమాసియాలో శాంతిసుస్థిరతను సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించాలని ప్రపంచ దేశాలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆయా దేశాల్లో జరుగుతున్న ఘర్షణలు.. గ్లోబల్ సౌత్ దేశాలపై అత్యంత ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘర్షణలను నివారించేందుకు ప్రయత్నించాలని ప్రపంచదేశాలకు సూచించారు. తాను బుద్ధుడు జన్మించిన దేశం నుండి వచ్చానన్నారు. అయితే యుద్ధరంగంలో సమస్యలకు పరిష్కారాలు మాత్రం దొరకవని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.



సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతతోపాటు అంతర్జాతీయ చట్టాలను సైతం గౌరవించాల్సి ఉందన్నారు. చర్చలకు, దౌత్యానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. ఆ క్రమంలో విశ్వ బంధు భారత్.. అన్ని విధాలుగా సహకరాన్ని అందిస్తుందని ఆయన స్పష్టం చేశారు. అలాగే ఆ ప్రాంతంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పక్కనే ఉన్న మయన్మార్‌తో భారత్ కలిసి నడుస్తుందన్నారు. పొరుగుదేశం భారత్.. తన బాధ్యతను కొనసాగిస్తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారత్ యాక్ట్ ఈస్ట్ పాలసీలో తూర్పు ఆసియా సదస్సు అత్యంత ముఖ్యమైనదని ఈ సందర్భంగా ప్రధాని మోదీ గుర్తు చేశారు.

**మోదీ మీరే డీల్ చేయాలి..**

**లేకుంటే మూడో ప్రపంచ యుద్ధమే..**

ఇజ్రాయెల్, లెబనాన్, ఇరాక్ దేశాల మధ్య పోరు రోజూ రోజుకు తీవ్రతరం అవుతుంది. అలాగే పలు దేశాల మధ్య సంబంధాలు సైతం ఉప్పు నిప్పు తరహాలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం లండన్ వేదికగా జరిగిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ జ్యూరిట్స్ అండ్ రైటర్స్ ఫర్ వరల్డ్ ఫీస్ స్పందించింది. ఈ ఘర్షణలను నిలుపుదల చేసేందుకు శాంతి దౌత్యం జరపాలని ప్రధాని మోదీకి ఈ ప్రపంచ సదస్సులో పాల్గొన్న ప్రముఖులు విజ్ఞప్తి చేశారు. అందుకోసం వెంటనే రంగంలోకి దిగాలని వారు సూచించారు. లేకుంటే మూడో ప్రపంచ యుద్ధం వచ్చే అవకాశముందని వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

# టాటా ట్రస్ట్ ఛైర్మన్‌గా నోయల్

**ముంబై :** టాటా ట్రస్ట్స్ కొత్త ఛైర్మన్‌గా నోయెల్ టాటా నియమితులయ్యారు. రతన్ టాటా మరణానంతరం ఈ బాధ్యతను నోయల్ టాటాకు అప్పగించారు. 1991లో రతన్ టాటాకు టాటా గ్రూప్ బాధ్యతలు అప్పగించారు. అప్పుడే ఆయన టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ పదవి చేపట్టారు. 86 ఏళ్ల వయసున్న రతన్ టాటా, తన మరణించే వరకు ఆ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. రతన్ టాటా రెండు రోజుల క్రితం, అనారోగ్యంతో ముంబైలోని ఓ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. అక్టోబర్ 10న, ముంబైలో, ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. దేశ, విదేశీ ప్రజలు, ప్రముఖుల అశ్రునయాల మధ్య ఆయన శాశ్వతంగా ఈ లోకాన్ని విడిచిపెట్టారు. రతన్ టాటా మరణం తర్వాత, దాతృత్వ ఽ వ్యాపార వ్యవహారాల పగ్గాలు చేపట్టే వారసుడిని నియమించడానికి టాటా న్యాసా (టాటా ట్రస్ట్స్) సమావేశమైంది. టాటా ట్రస్ట్స్ తదుపరి ఛైర్మన్ నియామకంపైనే ఈ భేటీలో ప్రధానంగా చర్చ జరిగింది. గత 40 సంవత్సరాలుగా టాటా గ్రూప్‌తో అనుబంధం ఉన్న రతన్ టాటా సవతి సోదరుడు నోయల్ టాటాకు టాటా ట్రస్ట్స్ బాధ్యతలు అప్పగిస్తూ సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు.

**ఇప్పటికే టాటా ట్రస్ట్స్‌తో అనుబంధం**

టాటా ట్రస్ట్‌లో, ఇప్పటికే, నోయెల్ టాటా చాలా చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం, టాటా ట్రస్ట్ పరిధిలోకి వచ్చే సర్ రతన్ టాటా ట్రస్ట్, సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్‌లకు ఆయన ట్రస్టీగా ఉన్నారు. ఈ ట్రస్టులు టాటా గ్రూప్ దాతృత్వ కార్యకలాపాలను నిర్వహిస్తాయి. టాటా గ్రూప్ మాతృ సంస్థ



అయిన టాటా సన్స్‌లో టాటా ట్రస్ట్‌కు 66 శాతం వాటా ఉంది.

**నోయెల్ టాటా హయాంలో గ్రూప్ కంపెనీల ముందడుగు**

నోయెల్ టాటా చాలా టాటా గ్రూప్ కంపెనీల బోర్డుల్లో సభ్యుడిగా ఉన్నారు. టాటా గ్రూప్‌లోని రిటైల్ కంపెనీ ట్రెంట్, టాటా ఇంటర్నేషనల్ లిమిటెడ్, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్‌కు చైర్మన్‌గా ఽ టాటా స్టీల్, టైటన్‌లకు వైస్ చైర్మన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ట్రెంట్ హయాంలో సాధించిన విజయాలు సర్వత్రా ప్రశంసలు అందుకున్నాయి. ట్రెంట్ మార్కెట్ క్యాప్ రూ.2.93 లక్షల కోట్లకు చేరుకుంది. నోయెల్ టాటా ఆగస్టు 2010 నుంచి నవంబర్ 2021 వరకు టాటా ఇంటర్నేషనల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కూడా ఉన్నారు. ఆయన పదవీ కాలంలో కంపెనీ టర్నోవర్ 500 మిలియన్ డాలర్ల నుంచి 3 బిలియన్ డాలర్లకు పెరిగింది

నోయెల్ టాటా ప్రస్తుతం టాటా స్టీల్, టైటాన్ కంపెనీలకు వైస్ చైర్మన్‌గా ఉన్నారు. నోయెల్ టాటా 2000 ఆరంభంలో టాటా గ్రూపులో అడుగుపెట్టారు. ఆ నాటి నుంచి టాటా గ్రూప్ పురోగమనంలో ఆయన కూడా కీలక వ్యక్తిగా కృషి చేస్తున్నారు. సర్ రతన్ టాటా ట్రస్ట్, దొరాబ్జీ టాటా ట్రస్ట్‌ల సమావేశం అనంతరం ఇవాళ ఆయనను ఛైర్మన్‌గా ఎంపిక చేశారు.కాగా దివంగత రతన్ టాటా 1937లో సాంప్రదాయ పార్శీ కుటుంబంలో జన్మించారు. అయితే ఆయన 10వ ఏట తల్లిదండ్రులు నావల్ టాటా – సూనీ టాటా విడాకులు తీసుకున్నారు. దీంతో రతన్ టాటా తన అమ్మమ్మ వద్ద పెరిగాయి. తండ్రి రెండవ పెళ్లి చేసుకున్నారు.
నోయెల్ టాటా తల్లి సిమోన్ టాటాయే రతన్ టాటాకు సవతి తల్లి. ఆమె ఒక ఫ్రెంచ్–స్విస్ కాథలిక్. ప్రస్తుతం ట్రెంట్, వోల్టాస్, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్, టాటా ఇంటర్నేషనల్ కంపెనీలకు ఆమె ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఇక రతన్ టాటా తమ్ముడు జిమ్మీ వ్యాపారంలో అడుగుపెట్టలేదు. దక్షిణ ముంబైలోని కొలాబాలో నిరాడంబరమైన జీవితాన్ని గడుపుతున్నారు. కేవలం రెండు బెడ్‌రూమ్‌లు ఉన్న అపార్ట్‌మెంట్‌లో ఆయన నివసిస్తున్నారు.
కాగా టాటా సన్స్ ట్రస్ట్ కింద మొత్తం 14 ట్రస్ట్‌లు ఉన్నాయి. అయితే టాటా సన్స్ యాజమాన్యంలో ఎక్కువ భాగాన్ని సర్ రతన్ టాటా ట్రస్ట్, దొరాబ్జీ టాటా ట్రస్ట్‌లే నిర్వహిస్తుంటాయి. ఈ రెండు ట్రస్టులు ఉమ్మడిగా 50 శాతానికి పైగా యాజమాన్యాన్ని కలిగివున్నాయి. టాటా ట్రస్ట్‌లో ప్రస్తుతం వేణు శ్రీనివాసన్, విజయ్ సింగ్, మెహ్లీ మిస్త్రీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా కొనసాగుతున్నారు.


# పీకల్లోతు కష్టాల్లో కర్ణాటక కాంగ్రెస్


**బెంగళూరు :** కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న మూడు రాష్ట్రాల్లో కర్ణాటక ఒకటి. ఆ పార్టీకి కాస్త ధైర్యం ఇచ్చిన రాష్ట్రం కర్ణాటక. తిరుగులేని మెజార్టీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు అనేక సమస్యలు చుట్టుముడుతున్నాయి. ముందుగా రాజును బలహీనం చేస్తున్న బీజేపీ.. తర్వాత సైన్యాధిపతులను టార్గెట్ చేస్తూ వస్తోంది. సిద్ధరామయ్య ముడా స్కాంలో ఇరుక్కున్నారు. ఆ స్థలాలన్నీ వెనక్కి ఇచ్చేసి బయటపడాలని అనుకుంటున్నారు కానీ.. రాజకీయ దుమారం ఆగేలా లేదు. పెద్ద ఎత్తున నిరసనలు జరుగుతున్నాయి. అదే సమయంలో సీఎం మార్పు ఖాయమంటూ సొంత పార్టీలోనే ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో హనీ ట్రాప్ అంశంపై కూడా తెరపైకి వచ్చింది. సీఎం సిద్ధరామయ్యపై లోకాయుక్త విచారణకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినప్పటి నుంచి కాంగ్రెస్‌కు కష్టాలు ప్రారంభమయ్యాయి. అది రోజు రోజుకు పెను వివాదంగామారింది. చివరికి ఈడీ కూడా కేసు నమోదు చేసింది. ఆయన తనను తాను కాపాడుకునే పరిస్థితుల్లో ఉండటంతో మరో వైపు బీజేపీ ఆపరేషన్ కమల్ ప్రారంభించిందన్న ప్రచారం ఊపందుకుంది. ముఖ్యంగా డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఓ సారి ఢిల్లీ వెళ్లినప్పుడు బీజేపీ పెద్దల్ని కలిసినట్లుగా ప్రచారం జరిగింది. దీనిపై విస్తృత ప్రచారం జరగడంతో ఎందుకు కలవాల్సి వచ్చిందో వివరణ ఇవ్వడానికి రాహుల్ గాంధీ అమెరికాలో పర్యటిస్తూంటే అక్కడికి వెళ్లారు. ఆ తర్వాత పరిస్థితులు సద్దుమణిగినట్లుగా ఉన్నా.. నివురుగప్పిన నిప్పులానే ఉన్నాయని కాంగ్రెస్ నేతలు జరుపుతున్న సీక్రెట్ సమావేశాలతో వెల్లడవుతూనే ఉంది. కర్ణాటక రాజకీయాల్లో హనీ ట్రాప్‌కు ప్రత్యేకమైన పాత్ర ఉంటుంది. గతంలో కాంగ్రెస్, జేడీఎస్ ప్రభుత్వం కుప్పకూలిపోవడానికి ఈ హనీ ట్రాపే కారణం. సీనియర్ మంత్రి ఒకరు ఇలాంటి ట్రాప్ లో ఇరుక్కుని రాజీనామా చేయాల్సి వచ్చింది. తర్వాత చాలా



సీడీలు ఉన్నాయని ప్రచారం జరిగినా చివరికి ఏవీ బయటకు రాలేదు. కానీ ఎమ్మెల్యేలు మాత్రం పార్టీ మారిపోయారు. ప్రభుత్వం మారిపోయింది. ఇప్పుడు మరో మహిళ బెంగళూరులో ప్రెస్ మీట్ పెట్టి ఇద్దరు ముఖ్య నేతలు హనీ ట్రాప్‌లో ఇరుక్కున్నారని బీజేపీ నేతలు రక్షణ కల్పిస్తామని హామీ ఇస్తే వారికి ఇస్తానని చెప్పారు. ఆమె నిజంగా చెప్పిందా లేకపోతే రాజకీయమా అన్నది క్లారిటీ లేదు. కానీ అందులో ఏదైనా మ్యాటర్ ఉంటే మాత్రం రానున్న రోజుల్లో సంచలనం ఖాయమనుకోవచ్చు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటం బీజేపీకి ఇష్టం లేదని అనుకోవచ్చు. ముఖ్యమంత్రి మార్పు చర్చల్లో కాంగ్రెస్ నేతలు చాలా మంది తమకే సీఎం పదవి అని లెక్కలు వేసుకుంటున్నారు. ఎవరికి వారు ఎమ్మెల్యేల మద్దతు కూడగట్టుకుంటున్నారు. బలప్రదర్శనకు సిద్ధమవుతున్నారు. వీరిలో ఒకరైనా బీజేపీ వైపు కొంత మంది ఎమ్మెల్యేలతో వెళ్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి చిక్కులు ఏర్పడతాయి. అదే సమయంలో కర్ణాటకలో ఆపరేషన్ కమల్ నిర్వహించడంలో బీజేపీ చాలా సార్లు సక్సెస్ అయింది. ఇప్పుడు కూడా అలాంటిదే నిర్వహిస్తే ఫెయిలయ్యే అవకాశం లేకుండా చూసుకుంటుంది. అందుకే కర్ణాటకలో ఏం జరుగుతుందా అన్న ఆసక్తి దేశమంతా వ్యక్తమవుతోంది.

## ఆప్ మద్దతు ఆ పార్టీకే.. ఎల్జీకి లేఖ సమర్పణ






**శ్రీనగర్:** జమ్మూకశ్మీర్‌లో ప్రభుత్వం ఏర్పాటుకు సిద్ధమవుతున్న నేషనల్ కాన్ఫరెన్స్‌కు ఆమ్ ఆద్మీ పార్టీ అధికారికంగా మద్దతు ప్రకటించింది. ఒమర్ అబ్దుల్లా సారథ్యంలోని ప్రభుత్వానికి తాము మద్దతిస్తున్నట్టు పేర్కొంటూ లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయానికి ఆ పార్టీ ఒక లేఖను అందించింది. ఇటీవల వెలువడిన జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో దోడా నియోజకవర్గం నుంచి 'ఆప్' అభ్యర్థి మెహ్రాజ్ మాలిక్ గెలుపొందారు. నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ ఇప్పటికే ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన బలాన్ని సమకూర్చుతుంది. సొంతంగా 42 సీట్లలో ఎన్సీ గెలుపొందగా, భాగస్వామ్య పార్టీగా ఉన్న కాంగ్రెస్ 6, సీపీఎం ఒక సీటు గెలుచుకున్నాయి. దీంతో ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన మెజారిటీని ఎన్సీ–కాంగ్రెస్ కూటమి దక్కించుకుంది. దీనికి తోడు స్వతంత్ర అభ్యర్థులుగా గెలిచిన ఏడుగురిలో నలుగురు గురువారంనాడు ఎన్సీకి మద్దతు ప్రకటించారు. తాజాగా ఆప్ సైతం ఎన్సీకి మద్దతు తెలిపింది. నేషనల్ కాన్ఫరెన్స్ లెజిస్లేటివ్ గ్రూప్ నేతగా ఒమర్ అబ్దుల్లా ఎన్నికైనట్టు ఆ పార్టీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా ప్రకటించారు. దీంతో ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా ఎల్జీని కోరేందుకు ఎన్సీ సన్నద్ధమవుతోంది.

## 'ఎన్డీయే ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించండి'.. నితీశ్ కుమార్‌కు అఖిలేష్ విజ్ఞప్తి





**లక్నో:** జై ప్రకాష్ నారాయణ్ ఉద్యమం నుంచి ఉద్భవించిన నితీశ్ కుమార్ పార్టీ, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించాలని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలోని జై ప్రకాష్ నారాయణ్ ఇంటర్నేషనల్ సెంటర్ (జేపీఎన్ఐసీ)ను సందర్శించేందుకు గురువారం రాత్రి ఆయన ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సోషలిస్ట్ నేత జై ప్రకాష్ నారాయణ్ (జేపీ) జయంతి సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి అఖిలేష్ యాదవ్ అక్కడకు చేరుకున్నారు. ఒక వాహనంపై ఏర్పాటు చేసిన జేపీ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళి అర్పించారు. కాగా, అఖిలేష్ యాదవ్ ఈ సందర్భంగా మాట్లాడారు. ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వం జేపీఎన్ఐసీ ప్రధాన ద్వారాన్ని మూసివేసి తన ప్రవేశాన్ని నిరోధించిందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఎన్డీయేకు మద్దతు వెనక్కి తీసుకోవాలని బీహార్ సీఎం, జేడీ(యూ) చీఫ్ నితీశ్ కుమార్‌ను కోరారు. 'చాలా మంది సోషలిస్టులు ఎన్డీయే ప్రభుత్వంలో ఉన్నారు. ఆ ప్రభుత్వం కొనసాగడానికి సహాయం చేస్తున్నారు. నితీశ్ కుమార్, ఆయన పార్టీ జై ప్రకాష్ నారాయణ్ ఉద్యమం నుంచి ఉద్భవించారు. జేపీ జయంతి సందర్భంగా ఆయనకు నివాళి అర్పించేందుకు సోషలిస్టులను అనుమతించని ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకోవడానికి నితీశ్ కుమార్‌కు ఇది ఒక అవకాశం' అని అన్నారు. అయితే జేపీఎన్ఐసీలో పనులు జరుగుతున్నందున భద్రతా కారణాల వల్ల అఖిలేష్ యాదవ్‌ను అనుమతించలేదని అధికారులు వివరించారు.

## హర్యానాలో బీజేపీ ప్రభుత్వ ప్రమాణస్వీకారానికి ముహూర్తం ఇదే



**చండీగఢ్:** హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా మూడోసారి విజయాన్ని సాధించిన బీజేపీ కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు సిద్ధమవుతోంది. అక్టోబర్ 15వ తేదీన పంచకుల లో ప్రమాణ స్వీకారం జరిగే అవకాశం ఉందని పంచకుల డిప్యూటీ కమిషనర్ డాక్టర్ యష్ గార్గ్ తెలిపారు. ప్రమాణ స్వీకారానికి సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు 10 మంది సభ్యులతో కూడిన కమిటీని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి యష్ గార్గ్ నేతృత్వం వహిస్తున్నారు. హర్యానా కొత్త ప్రభుత్వ ప్రమాణస్వీకార కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ అగ్రనేతలు, ఆ పార్టీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. గత మార్చిలో మనోహర్ లాల్ ఖట్టర్ స్థానంలో ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన బీజేపీ సీనియర్ నేత నయబ్ సింగ్ సైనీ తిరిగి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశాలున్నాయి. ఆయన సారథ్యంలోనే బీజేపీ హర్యానా అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లింది. పార్టీ గెలిస్తే సైనీనే మళ్లీ ముఖ్యమంత్రి అవుతారంటూ ఎన్నికల ప్రచార సమయంలో బీజేపీ సైతం సంకేతాలిచ్చింది. హర్యానాలో ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ బీజేపీ మొత్తం 90 సీట్లలో 48 సీట్లు గెలుచుకుంది. కాంగ్రెస్ 37 సీట్లకే పరిమితమైంది. ఎన్నికల్లో గెలిచిన ముగ్గురు ఇండిపెండెంట్లు ఇప్పటికే ప్రభుత్వం ఏర్పాటులో బీజేపీకి మద్దతు ప్రకటించారు.

# సీఎం రేవంత్ రెడ్డి ముందు దానికి సమాధానం చెప్పాలి

-మొదటిపేజీ తరువాయి

స్థలాలు కొనుక్కున్నారని, వారికి ప్రభుత్వమే అన్నీ అనుమతులు ఇచ్చి ఇప్పుడు కూలుస్తామని చెప్పడం దారుణమని ఆయన అన్నారు. కూల్చివేతలు అంత ఈజీ కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే స్వయంగా మూసీ ప్రాంతంలో పర్యటించి ప్రజలను ఒప్పించాలని డిమాండ్ చేశారు.

**బెదిరింపులకు దిగుతారా?**

మూసీ రిటర్నింగ్ వాల్ నిర్మించి కూడా సుందరీకరణ చేయెచ్చని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. అన్నీ డ్రైనేజీలు మూసీలోనే కలుస్తున్నాయని, కనీసం శుద్ధి జరగకుండా నేరుగా నదిలోనే మురుగునీరు కలుస్తోందని ఆయన చెప్పారు. గంగా నదిపై కేంద్ర ప్రభుత్వం అతి తక్కువ ఖర్చుతో శుద్ధి చేస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. మూసీ సుందరీకరణకు రూ.1.50లక్షల కోట్లు అవసరం లేదని స్పష్టం చేశారు. రేస్ కోర్స్ స్థలం అమ్మేసి మరీ సుందరీకరణ చేయడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. ప్లాన్ లేకుండా ఇళ్లు కూల్చివేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. సీఎం దుందుడుకుగా వ్యవహరిస్తానంటే కుదరదని కేంద మంత్రి హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇలాగే ప్రజలపై బెదిరింపులకు పాల్పడిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రాకు గవర్నర్ చట్టబద్ధత కల్పించడం సాధారణ ప్రక్రియ అని, బాధితులు ఎవరూ భయపడొద్దని చెప్పారు. మూసీ బాధితుల కోసం బీజేపీ పోరాటం చేస్తోందని ఆయన మరోసారి చెప్పుకొచ్చారు.



**మురుగునీరు ఏం చేస్తారు?**

ప్రజలు బలహీనులు కాదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైడ్రా అంటే భూతం కాదని, గతంలోనూ అక్రమ నిర్మాణాలను ప్రభుత్వం కూల్చేదని ఆయన చెప్పారు. అయితే ప్రస్తుతం దాని పేరును మార్చారని, అదే హైడ్రా అని చెప్పారు. హైడ్రా ముందుగా మూసీ నదిలో ఉన్న బస్ డిపో, మెట్రో పిల్లర్స్‌ను కూల్చాలని కేంద్ర మంత్రి డిమాండ్ చేశారు. వాటిని కూల్చకుండా ముందుగా పేదవారి ఇళ్లు ఎలా పడకొడతారంటూ ఆయన ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలోకి వెళ్లి అభిప్రాయాలు తెలుసుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి రావాలని డిమాండ్ చేశారు. మూసీలో కలిసే మురుగునీరు ఏం చేస్తారో ముందు సమాధానం చెప్పాలని సీఎంను డిమాండ్ చేశారు. నగరంలోని అన్ని ప్రాంతాల మురుగునీరు వచ్చి మూసీలోనే కలుస్తోందని తెలిపారు. దీనిపై సీఎం ముందుగా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేతలు తనను సంప్రదించారని వస్తున్న వార్తలను కిషన్ రెడ్డి ఖండించారు. తనను ఇప్పటివరకూ ఎవరూ సంప్రదించలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

**మాకే ఓట్లు..**

ఈ సందర్భంగా జమ్మూకాశ్మీర్ ఎన్నికలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 98శాతం హిందువుల ఓట్లు తమకే వచ్చాయని కిషన్ రెడ్డి చెప్పారు. కశ్మీరీ పండిట్లు మొత్తం తమకే ఓట్లు వేశారని చెప్పారు. ఆర్టికల్ 370రద్దు ఓ చరిత్ర అని, దాన్ని తిరిగి తీసికొని వచ్చే అవకాశమే లేదన్నారు. చిన్న ఘటనా చోటు చేసుకోకుండా 60 శాతం ఓటింగ్ జరిగిందని ఆయన చెప్పారు. ఫేక్ నోట్లు నియంత్రించామని, టెర్రరిజాన్ని అరికట్టగలిగామని కిషన్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఐఎస్ఐపై కఠిన చర్యల కారణంగానే ఇదంతా జరిగిందని కేంద్ర మంత్రి చెప్పారు. జార?ండ్‌లో జరిగే ఎన్నికల్లోనూ తామే గెలవబోతున్నట్లు ఆశాభావం వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌ను ప్రపంచ దేశాల ముందు దోషిగా నిలబెట్టామని, చైనా ఆహారం, ఆయుధాలు పాకిస్థాన్‌కు ఇస్తోందని మండిపడ్డారు. కాశ్మీర్‌లో పాక్ ఆటలు ఇకపై సాగనివ్వమని కిషన్ రెడ్డి హెచ్చరించారు.

# ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య

-మొదటిపేజీ తరువాయి

వాగ్దానం చేశాం. రాష్ట్రాన్ని విద్యా, వైద్య రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టేందుకు కృషి చేస్తామని చెప్పాం. బీఆర్ఎస్ సర్కార్ ఐదు వేల పాఠశాలలను మూసివేసి.. అణగారిన వర్గాలకు విద్యకు దూరం చేసింది. అందుకే ప్రతి పేదవాడికి నాణ్యమైన విద్యను అందించాలని అనుకున్నాం.

బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల పాఠశాలలను మూసి వేశారని, తాము మాత్రం అన్ని పాఠశాలలను పునః ప్రారంభించి నాణ్యమైన విద్యను అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.షాద్ నగర్ లో జరిగిన యంగ్ ఇండియా రెసిడెన్షియల్ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్ పాల్గొన్నారు. సీఎం మాట్లాడుతూ.. దళితులకు, గిరిజనులకు విద్యను దూరం చేసేందుకు బీఆర్ఎస్ తన ప్రభుత్వ పాలనలో పాఠశాలలను మూసివేసిందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం సామాన్య, పేద కుటుంబాల విద్యార్థులకు నాణ్యమైన అందించేందుకు తాము నియోజకవర్గానికి ఒక స్కూల్.. 20 నుండి 25 ఎకరాలలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. అలాగే టీచర్స్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం విశేష కృషి చేసిందన్నారు.34 వేల మంది టీచర్ల బదిలీ, 21 వేల మంది టీచర్స్ కి ప్రమోషన్ ఇచ్చామన్నారు. అలాగే ఇటీవల 11 వేలకు పైగా ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. తెలంగాణ లోని ప్రతి బిడ్డ.. చదువుకొని ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే తన కోరికగా సీఎం అన్నారు. డాక్టర్స్, ఇంజనీర్స్, లాయర్స్, ఇలా ప్రతి విద్యార్థి భవిష్యత్ లో బంగారు బాటలో నడవాలన్నదే తమ ప్రభుత్వ విధానమన్నారు. కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీనని, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని రేవంత్ తెలుపగా.. సభకు హాజరైన ప్రజలు గట్టిగా కేకలు వేస్తూ తమ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారుమాజీ సీఎం కేసీఆర్ ను ఉద్దేశించి సీఎం మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో జీరో స్థానాలు ఇచ్చినా..



ఇంకా బుద్ధి రాలేదన్నారు. తన పాలనలో ప్రభుత్వ పాఠశాలలను, రెసిడెన్షియల్ స్కూల్స్ ని నిర్లక్ష్యం చేసిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందన్నారు. కేసిఆర్ పదేళ్ల కాలంలో విద్యార్థులకు ఏనాడైనా మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టారా అంటూ ప్రశ్నించారు. మీ పిల్లలు బాగా చదువుకోవాలి.. కానీ పేదల పిల్లలు చదువుకోవద్దా అంటూ కేసీఆర్ ను ఉద్దేశించి సీఎం మాట్లాడారు. పార్టీ కార్యాలయాలు అన్ని జిల్లాలలో నిర్మించిన కేసిఆర్.. ఒక్క జిల్లాలో కూడా పాఠశాల నిర్మాణం చేయలేదన్నారు.అలాగే మాజీ ఐపీఎస్ అధికారి, బీఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ను ఉద్దేశించి రేవంత్ మాట్లాడుతూ.. దొరల పార్టీలో చేరిన మీకు గురుకులాల అభివృద్ధి కనిపించడం లేదా.. పేదలకు నాణ్యమైన విద్యను అందించాలన్న తమ సంకల్పాన్ని ఎందుకు వ్యతిరేకిస్తున్నారంటూ. ప్రశ్నించారు. ప్రవీణ్ కుమార్ ఒక మంచి అధికారిగా తాను గౌరవిస్తానని, ఇప్పటికైనా తమ ప్రభుత్వం చేపట్టిన యంగ్ ఇండియా రెసిడెన్షియల్ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పట్ల వ్యతిరేకించడం మానుకోవాలన్నారు. కేసీఆర్ చెప్పిన మాటలు చెప్పకుండా నిజాలు గ్రహించాలని కోరారు. 100 కోట్ల నుండి 120 కోట్లు ఖర్చు పెట్టి సాంకేతిక విద్యను అన్ని వర్గాల వారికి అందించేందుకు తాము కృషి చేస్తున్నట్లు తెలిపారు. అన్ని శాసనసభ నియోజకవర్గాలలో ఈ స్కూల్స్ నిర్మాణం చకచకా సాగుతుందని, విద్యార్థులు బాగా చదివి మంచి పేరు ప్రఖ్యాతులు సాధించాలని రేవంత్ ఆకాంక్షించారు.

అందుకే విద్యా శాఖలో సంపూర్ణంగా మార్పులు చేశాం. కోరుకున్న విధంగా బదిలీలు జరిపాం. ఏ చిన్న పొరపాటు లేకుండా 21 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతి ఇచ్చాం. అధికారులతోనే ఇది సాధ్యపడింది. ఏడు లక్షల కోట్ల అప్పు చేసిన కేసీఆర్ ఏనాడూ విద్యాభివృద్ధికి కృషి చేయలేదు. పేదలు చదవకూడదన్నది వారి ఉద్దేశం. నరసింహారావు 1971 లో గురుకుల విద్యా వ్యవస్థను తెచ్చారు. అందులో చదివిన ఎంతోమంది నిరుపేదలు పెద్ద పెద్ద స్థానాల్లో ఉన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రవేశ పెట్టిన గురుకులాల్లో మౌలిక సదుపాయాలు ఉన్నాయా. కనీస వసతులు కల్పించలేదు. ఈ విషయాలు నగ్న సత్యాలు. వీటిని బీఆర్ఎస్ నేతలు తప్పుబడుతున్నారు. బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అంటే నాకు గౌరవం.. మీరు ఎక్కడ ఉంటారో మీ ఇష్టం. కానీ మీరు కూడా పేదలకు విద్య అవసరం లేదని అనుకుంటున్నారా. బీసీ, ఎస్సీ, ఎస్టీలు.. కుల వృత్తులకే పరిమితం కావాలా. పిల్లలకు చదువు చెప్పడం, పేదలకు వైద్యం అందించడం మా విధానం. మీ విధానం, మీరు సీఎం కావడం, కొడుకు, అల్లుడిని మంత్రిని చేయడం, మరొకరిని ఎంపీని చేయడం. వాళ్లందరినీ ఓడించినా బుద్ధి మారలేదు. పేదలందరికీ నాణ్యమైన విద్యనందించేందుకే రెసిడెన్షియల్ పాఠశాలలు పెడుతున్నాం. బీఆర్ఎస్ నేతలకు వారి పార్టీ కార్యాలయాలకు భూమి ఉంటుంది కానీ, బడులు కట్టడానికి భూమి, నిధులు ఉండవు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు వేర్వేరు పాఠశాలలుంటే వారిలో కల్మషాలు పెరగవచ్చు. కనుక అందరినీ ఒకే దగ్గర చదివిస్తే సోదర భావం పెరుగుతుందని ఇలాంటి సమీకృత పాఠశాలలను కట్టాలనే ఆలోచన వచ్చింది" అని రేవంత్ పేర్కొన్నారు.

## భావితరాల భవిష్యత్ కోసమే హైడ్రా ఏర్పాటు

-మొదటిపేజీ తరువాయి



ఈ నేపథ్యంలో ఈ ఇష్యూ ఆ రోజే క్లోజ్ అయిందన్నారు. రేవంత్ కేబినెట్ నుంచి కొండా సురేఖను తప్పిస్తాంటూ జరుగుతున్న ప్రచారంలో ఏ మాత్రం వాస్తవం లేదన్నారు.

ఈ అంశంపై పార్టీ అధిష్టానం సైతం ఎటువంటి వివరణ తమను కోరలేదని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ విలేకర్లతో మాట్లాడుతూ.. హీరో అక్కినేని నాగార్జున కుటుంబంపై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు కావాలని చేసినవి కావని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి కేటీఆర్ వైఖరి వల్లే కొండా సురేఖ అలాంటి వ్యాఖ్యలు చేయాల్సి వచ్చిందన్నారు. అయినా ఆమె అలా మాట్లాడాల్సింది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇక ఇదే అంశంలో హీరో నాగార్జున కోర్టును ఆశ్రయించారని గుర్తు చేశారు. ఈ కేసులో కోర్టు ఏం చెబుతుందో చూద్దామన్నారు. అలాగే ఫిరోజ్ ఖాన్‌పై ఎంఐఎం దాడి ఘటనపై సైతం పీసీసీ చీఫ్ స్పందించారు. ఎంఐఎంతో స్నేహం వేరు, శాంతిభద్రతలు వేరని ఆయన పేర్కొన్నారు. ఫిరోజ్ ఖాన్‌పై దాడి విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లినట్లు చెప్పారు. అయితే దాడుల విషయంలో తమ ప్రభుత్వం చాలా కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. అయితే ఇతర పార్టీల నుంచి పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరిన నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో కొంత ఇబ్బందికర వాతావరణం ఎదురవుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో చేరికలకు ప్రస్తుతానికి బ్రేక్ వేశామన్నారు. ఇక దసరా పండగ వేళ.. రెండో విడత కార్పొరేషన్ పదవులు కేటాయించాలని ముందుగా అనుకున్నామన్నారు. కానీ కుదరలేదని చెప్పారు. అయితే దీపావళి లోపు మాత్రం రెండో విడత కార్పొరేషన్ పదవులు కేటాయిస్తామని ఆయన స్పష్టం చేశారు. త్వరలోనే తాను జిల్లాల పర్యటనకు వెళ్తానని ఆయన ప్రకటించారు. అయితే భావితరాల భవిష్యత్ కోసమే హైడ్రా ఏర్పాటు చేశామన్నారు. మూసీ అభివృద్ధికి రూ. లక్షా యాభై వేల కోట్ల కేటాయించినట్లు వస్తున్న వార్తల్లో ఎక్కడా నిజం లేదన్నారు. అలా అని తాము ఎక్కడ ప్రకటించ లేదన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వందేళ్ల దోపిడీ జరిగిందని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు.

## సర్పంచ్ ఎన్నికలపై సీఎం రేవంత్ కీలక ప్రకటన

**హైదరాబాద్ :** తెలంగాణలో స్థానిక సంస్థల ఎప్పుడు జరుగుతాయనే చర్చకు తెర దింపారు సీఎం రేవంత్ రెడ్డి. ఎన్నికల్లో చెప్పినట్టుగా కులగణన, ఎస్సీ వర్గీకరణ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ ఇస్తామని సీఎం రేవంత్ ఇటీవల ప్రకటన చేశారు. ఇందుకోసం ఏకసభ్య న్యాయ కమిషన్ పేరుతో ఒక కమిటీ కూడా ఏర్పాటు చేశారు. ఈ కమిటీ 60 రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని అధికారులకు సీఎం ఆదేశాలు ఇచ్చారు. కాగా మరో రెండు నెలల్లో తెలంగాణలో సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది.

**ఉద్యోగ నోటిఫిషన్లకు బ్రేక్:**

ఇటీవల బీసీ కులగణన అంశాలపై మంత్రివర్గ ఉప సంఘం సభ్యులతో సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 2011 తర్వాత జన గణన జరగని కారణం గా 2011 జనాభా లెక్కల ప్రాతిపదికగా అధ్యయనం జరగాలని అన్నారు. క్షేత్రస్థాయి విజ్ఞాపనలు, ఫిర్యాదుల కోసం కమిషన్ జిల్లాల్లో పర్యటించాలని చెప్పారు. ఏకసభ్య న్యాయ కమిషన్ నివేదిక సమర్పించిన తర్వాత కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని అన్నారు. తెలంగాణలో బీసీ సామాజిక, ఆర్థిక, కుల సర్వే ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని అన్నారు. బీసీ కమిషన్కు తక్షణం అవసరమైన యంత్రాంగం సమకూర్చాలని అన్నారు. 60 రోజుల్లోగా సామాజిక, ఆర్థిక సర్వే పూర్తి చేసి డిసెంబరు 9 లోపు నివేదిక సమర్పించాలని చెప్పారు. ఈ సర్వే పూర్తయితే వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని అన్నారు.

## ఎమ్మెల్యేలు, బీసీ సంఘాలతో సీఎం భేటీ

**హైదరాబాద్ :** లంగాణలో మరో మూడు నెలల్లో గ్రామ పంచాయితీ ఎన్నికలు జరగనున్నాయి. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలంటే ముందుగా బీసీ కులగణన చేపట్టాలని, బీసీలకు 42 శాతం రాజకీయ వాటా ఇవ్వాల్సిందేనని బీసీ సంఘాలు, బీసీ నేతలు పట్టుబట్టారు. ఈ నేపథ్యంలోనే సీఎం రేవంత్ రెడ్డి ముందడుగు వేశారు. కాంగ్రెస్ బీసీ ఎమ్మెల్యేలు, బీసీ సంఘాల నేతలు, అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇందులో భాగంగానే బీసీ కులాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై ఆయన దృష్టి సారించినట్లు తెలుస్తోంది.పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే శ్రీహరి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులుతో పాటు బీసీ సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ జాజుల శ్రీనివాస్ గౌడ్, మహిళా ప్రెసిడెంట్ మణిమంజరి సాగర్, ఇతర నేతలు సీఎంతో భేటీ అయ్యారు.తెలంగాణలో బీసీలకు సామాజిక, ఆర్థిక, కుల గణన ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ నేతలంతా హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో బీసీలకు స్వర్ణయుగం రానుందని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రాణాలు తీసిన ఫైరింగ్ ప్రాక్టీస్

మహారాష్ట్రలోని నాసిక్‌లో గురువారం జరిగిన ఫైరింగ్ ప్రాక్టీస్‌లో విషాదం చోటుచేసుకుంది. ప్రాక్టీస్ సందర్భంగా ఇండియన్ ఫీల్డ్ గన్ నుంచి షెల్ మిస్‌ఫైర్ కావడంతో ఇద్దరు ఆర్మీ అగ్నివీరులు మరణించారు. మృతులిద్దరూ ఫైరింగ్ శిక్షణ కోసం హైదరాబాద్ నుంచి నాసిక్‌కు వెళ్లారు. దేశసేవ చేయాలని భావించిన వారు ఆ ఆశ తీరకుండానే అసువులు బాసారు. మృతులు విశ్వరాజ్ సింగ్ (20), సైఫత్ షిట్ (21) గా గుర్తించారు. డియోలాలిలోని ఆర్టిలరీ స్కూలులో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. దీనిపై కోర్ట్ ఆఫ్ ఎంక్వయిరీకి ఆదేశించినట్టు ఇండియన్ ఆర్మీ అధికారులు తెలిపారు. ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తుండగా ఒక షెల్ పేలడంతో ఇద్దరు అగ్నివీరులకు తీవ్రగాయాలయ్యాయని, వారిని డియోలాలిలోని ఎంహెచ్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారని అధికారులు తెలిపారు. కాగా, ఘటనపై హవిల్దార్ అజిత్ కుమార్ ఫిర్యాదు మేరకు ప్రమాదవశాత్తు గన్ పేలి ఇద్దరు అగ్నివీరులు మృతి చెందినట్టు డియోలాలి క్యాంప్ పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేపట్టారు. ఇటీవల ఇదే తరహా రాజస్థాన్‌లోని భరత్‌పూర్‌లో కూడా చోటుచేసుకుంది. మాక్ డ్రిల్ జరుగుతుండగా మంటలను ఆర్పే యంత్రం పేలడంతో అగ్నివీర్ సౌరభ్ పాల్ (24) మృతిచెందాడు. అతనిని ఉత్తరప్రదేశ్ వాసిగా గుర్తించారు.

## ఏపీకి నిధులు.. తెలంగాణకు గుండు సున్నా

-మొదటిపేజీ తరువాయి

హరీశ్ రావు విమర్శించారు. గోదావరి పుష్కరాల కోసం ఏపీకి కేంద్రం రూ. 100 కోట్ల నిధులు ఇచ్చిందని... తెలంగాణకు మాత్రం గుండు సున్నా ఇచ్చిందని మండిపడ్డారు. తెలంగాణకు రావాల్సిన నిధుల కోసం పోరాడడంలో బీజేపీ, కాంగ్రెస్ ఘోరంగా విఫలమయ్యాయని దుయ్యబట్టారు.

రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా... తెలంగాణకు కేంద్రం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని అన్నారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు వచ్చింది సున్నా అని... ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక నిధుల కింద రూ. 15 వేల కోట్లు మంజూరయ్యాయని వ్యాఖ్యానించారు.

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక నిధుల కింద రూ. 15 వేల కోట్లు మంజూరు కాగా.. తెలంగాణకు మాత్రం దక్కింది గుండు సున్నా అన్నారు. లోక్‌సభలో బీఆర్ఎస్ బలమైన స్థానంలో ఉండి ఉంటే.. ఈ అన్యాయాన్ని మేము ఎప్పటికీ సహించేవాళ్లం కాదన్నారు.ఎప్పటికైనా ఇంటిపార్టీ బీఆర్ఎస్సే తెలంగాణకు రక్షణ కవచం అన్నారు. తెలంగాణకు జరిగిన అన్యాయాలపై ఇప్పటికైనా ఆ పార్టీలు స్పందించాలని డిమాండ్ చేశారు.

లోక్‌సభలో బీఆర్ఎస్ బలమైన స్థానంలో ఉండి ఉంటే.. ఈ అన్యాయాన్ని తాము జరగనిచ్చే వాళ్లం కాదని అన్నారు. మరోసారి తెలంగాణను పక్కన పెట్టారా? అని ప్రశ్నించారు. ఈ పక్షపాత ధోరణి ఎందుకని అడిగారు. ఇతర రాష్ట్రాలతో సమాన వాటాను తెలంగాణ డిమాండ్ చేస్తోందని చెప్పారు.

## తహసీల్దార్ల బదిలీలకు గ్రీన్ సిగ్నల్

-మొదటిపేజీ తరువాయి

ఇప్పటికే కలిశారు. ఇందులో భాగంగానే ఎన్నికల బదిలీలపై వినతిపత్రాలను సైతం అందజేశారు. అలాగే ఇదే విషయంపై ఇటీవల రెవెన్యూ మంత్రితో జరిగిన ముఖాముఖి సమావేశంలో చర్చించారు. దీంతో ఈ విషయంపై ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని సానుకూలంగా స్పందించారు. అనంతరం బదిలీలకు అనుమతి ఇచ్చినట్లు తెలుస్తోందిరాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై టీజీటీఏ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు టీజీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు రాములు, మహిళా అధ్యక్షురాలు రాధ, ప్రధాన కార్యదర్శి రమేష్,సెక్రటరీ జనరల్ పూల్ సింగ్ చౌహాన్ లు రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాస్ రెడ్డి, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్ కు ధన్యవాదాలు తెలిపారు. ఇందులో భాగంగానే అర్హత, అవకాశం, ఆసక్తి ఉన్న ప్రతి తహసీల్దార్ కు ట్రాన్స్ ఫర్ అవకాశం కల్పించేలా చొరవ తీసుకోవాలని కోరారు.అయితే, ఎన్నికల బదిలీల విషయంలో చాలా ఆలస్యం జరిగిందని, బదిలీ అయిన ప్రతీ తహసీల్దార్ కు సొంత జిల్లాలకు వెళ్లే విధంగా అవకాశం కల్పించాలని కోరారు. అదే విధంగా ప్రతీ తహసీల్దార్ కు బదిలీ అవకాశం కల్పించేందుకు టీజీటీఏ కృషి చేస్తుందని వెల్లడించారు.

## ప్రపంచంతో పోటీ పడేందుకే ఆ పాఠశాలలు: మంత్రి తుమ్మల..



ఖమ్మం: ప్రపంచంతో తెలంగాణ బిడ్డలు పోటీపడేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్"కు శ్రీకారం చుట్టారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఎంత ఖర్చయినా సీఎం రేవంత్ రెడ్డి పట్టుదలతో నాణ్యమైన విద్య అందించేందుకు ఈ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు మంత్రి తుమ్మల ఇవాళ(శుక్రవారం) శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. "ఒక్కో పాఠశాలకు రూ.350కోట్ల వరకూ ఖర్చు చేసి భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా యంగ్ ఇండియా ఇంటిగ్రేడెట్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నాం. మొదటి విడత కింద నేడు 28 నియోజకవర్గాల్లో రూ.5వేల కోట్లతో పాఠశాలలకు శంకుస్థాపన చేశాం. రఘునాథపాలెం వద్ద అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన స్వామినారాయణ ట్రస్టు స్కూల్ ఏర్పాటు చేస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్‌తోపాటు స్వామి నారాయణ ట్రస్ట్ స్కూల్ వల్ల మండల ఖ్యాతి పెరుగుతుంది. ఖమ్మం నగరంలో రానున్న రోజుల్లో ఇస్కాన్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కిచెన్ ఏర్పాటు చేస్తాం. పేదరికం నుంచి ప్రజలు శాశ్వతంగా బయటపడాలంటే మణులు, మాణిక్యాలు అవసరం లేదు. ఒక్క విద్య ఉంటే చాలు. మన దేశ బలం మనకున్న యువతే. ఇటీవల వారు గంజాయి మహమ్మారికి అలవాటు పడుతున్నారు. పిల్లలపై పాఠశాల నిర్వాహకులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలి. డ్రగ్స్ బాధిత కుంటుంబాల కడుపుకోత తీర్చలేనిది. గంజాయి, డ్రగ్స్‌పై సీఎం రేవంత్ సర్కార్ ఉక్కుపాదం మోపుతోంది. ఇందిరమ్మ రాజ్యంతోనే సంక్షేమ రాజ్యం సాధ్యమని ముందే చెప్పాం. రూ.18వేల కోట్లతో రైతు రుణమాఫీ చేశాం. రెండు లక్షలపైన రుణం ఉన్న రైతులకూ మాఫీ చేస్తాం. పిల్లల చదువు, రైతులకు భరోసాతో రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలన సాగుతోంది" అన్నారు. మరోవైపు నేడు రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం కొందుర్గ్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలందరికీ ఆయన దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ దసరా నాలుగు కోట్ల ప్రజలందరూ సుఖశాంతులు ఇవ్వాలని సీఎం ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రోజునే రాష్ట్రాన్ని విద్య, వైద్య పరంగా అన్నీ విధాలుగా ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చిన విషయాన్ని రేవంత్ గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఐదు వేల పాఠశాలలను మూసివేసి అణగారిన వర్గాలకు విద్యను దూరం చేసిందని సీఎం ఆరోపించారు. అందుకే పేదలకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతోనే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఎంతోపాటు పలువురు మంత్రులు, శాసన మండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు.

# కాప్రా డివిజన్‌లో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా.

## భక్తిశ్రద్ధలతో వివిధ పూజలు,ధూప దీప నైవేద్యాలు సమర్పించిన భక్తులు...

## అమ్మవారికి కుంకుమార్చన మరియు ప్రత్యేక మంగళహారతులు...


**(శుభ తెలంగాణ/హైదరాబాద్)** కాప్రా డివిజన్‌లోని గాంధీనగర్‌లో గవర్నమెంట్ ప్రైమరీ స్కూల్ గ్రౌండ్ వద్ద ఏర్పాటుచేసిన శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిపారు.ఈ ఉత్సవాల సందర్భంలో అమ్మవారి నవదుర్గ రూపాలను ప్రతిరోజూ ప్రత్యేకంగా అలంకరించి,భక్తులకు దర్శనం కల్పించారు.తొమ్మిది రోజుల పాటు ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో వివిధ పూజలు,ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. ప్రతి రోజు భక్తులకు అమ్మవారి వివిధ రూపాలలో దర్శనం కలిగించేందుకు ప్రత్యేక అలంకరణలు చేపట్టారు.ఈ నవదుర్గ అలంకరణలు భక్తులను విశేషంగా భక్తులను ఆకర్షించాయి.ఉదయం, సాయంత్రం, భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారి దర్శనార్థం ఆలయానికి తరలి వచ్చి పూజలు నిర్వహించారు. కాలనీవాసులు,భక్తులు ఉత్సవాల్లో పాల్గొని, సంప్రదాయ పద్ధతిలో అమ్మవారి పూజలు చేసి తమ భక్తిని చాటుకున్నారు. ఈ నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు సంప్రదాయ రీతిలో పూజలు చేసి,వ్రతాలు,పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హారతుల తోపాటు,రోజూ సాయంకాలం అమ్మవారికి కుంకుమార్చన మరియు మంగళహారతులు నిర్వహించారు.ఉత్సవాలను మరింత వైభవవంతం చేయడానికి ఆలయ ప్రాంగణంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు,భక్తుల చేత సంకీర్తన కార్యక్రమాలు కూడా చేపట్టారు.వేదపారాయణం,సప్తశతి పారాయణం వంటి పూజా కార్యక్రమాలు జరిగాయి.ప్రతి రోజు భక్తులకు ప్రసాదం పంపిణీ చేయడమేకాక,ఆధ్యాత్మిక ప్రసంగాలు, భజనలు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ ఉత్సవాల ప్రధాన భాగంగా,తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక హోమాలు, వేదపారాయణం, సప్తశతి,పారాయణం వంటి పూజా కార్యక్రమాలు జరిగాయి.ప్రతి రోజు భక్తులకు ప్రసాదం పంపిణీ చేయడమేకాక,ఆధ్యాత్మిక ప్రసంగాలు,భజనలు



కూడా నిర్వహించడం విశేషమే నే చెప్పవచ్చు.అమ్మవారి ఉత్సవాలు ఈ దివ్యమైన నవరాత్రుల సందర్భంగా భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని,సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందించిన కార్య నిర్వాహకులకు కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ అమ్మవారి ఆశీస్సులు తమకు ఎప్పుడు ఉంటాయని పేర్కొన్నారు.

# ఐపిఎంలో అక్రమ ప్రమోషన్లు.. కోర్టు దిక్కార చర్యలు

**హైదరాబాద్ :** నీళ్లు, నిధులు, నియామకాలు అనే ప్రత్యేక ఎజండా తో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం లోని ఐ. పి. ఎం. నారాయణ గూడలో ఎదేచ్ఛగా ఆంధ్ర ప్రాంతానికి చెందిన పి ఎం ఎస్. కె కుమార్ కు తెలంగాణ రాష్ట్ర విభజన చట్టానికి వ్యతిరేకం గా తాత్కాలిక పదోన్నతులు కల్పించడం జరిగినదని సాటి ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఐ. పి. ఎం డైరెక్టర్ గా వ్యవహరిస్తున్న డా.శివలీలా పీఎంఎస్ కే కుమార్ కు కల్పించిన అక్రమ ప్రమోషన్లను సమీక్షించి రివర్షన్ ఇవ్వకుండా చట్టాన్ని, సుప్రీం కోర్టు ఉత్తర్వులను కూడా బేఖాతారు చేస్తూ, కొనసాగించడం జరుగుతుందని పేర్కొన్నారు. తెలంగాణ హైకోర్టు డబ్ల్యు పి నెంబర్ 1284/2020 స్టే ఆర్డర్ మరియు జీవో ఎంఎస్ నెంబర్ 106 ఫైనల్ బై ఫర్ కేషన్ అయినా కానీ పి ఎమ్ ఎస్ కె కుమార్ తెలంగాణ ప్రభుత్వానికి సమాచారం ఇవ్వకుండా ప్రభుత్వానికి తప్పుడు సమాచారం ఇస్తూ ఇంకో ప్రమోషన్ తీసుకోవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నాడని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ మెమో నెంబర్ 6307/జి /2022-1 వైద్య ఆరోగ్యశాఖ తేదీ:



01-09-2022, డబ్ల్యూపీ నెంబర్ 26476/2022 యొక్క ఉత్తర్వులు మరియు డబ్ల్యు పి నంబర్ 14588/2014 ఎస్ ఎల్ పి సి నెంబర్ 015516/2024 ఉత్తర్వులను అమలు చేయకుండా,ఎల్ ఎస్ వన్ గా కొనసాగిస్తున్నారని తెలిపారు. అతనికి రివర్షన్ చేయకుండా సీనియర్ ధీమతిలక్ష్మి చిన్న పోస్టులో పి ఎం ఎస్ కే కుమార్ జూనియర్ అయ్యుండి పెద్ద పోస్టులో విధులు కొనసాగిస్తున్నారని, తాత్కాలిక ప్రమోషన్ల లో చెల్లించబడిన జీతం రికవరీ చేయమని ఉన్న ఉత్తర్వులను బేఖాతారు చేస్తూ తెలంగాణ ఉద్యోగులకు మాత్రం చట్టభద్ధంగా రావలసిన ప్రమోషన్లను అడ్డుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే మెమో లు ఇవ్వడం దూర ప్రాంతాలకు బదిలీ చేయడం లాంటి చర్యలకు పాల్పడుతున్నారని, ప్రమోషన్ ఇవ్వమని కోర్ట్ ఉత్తర్వులు తెచ్చుకున్న ఒక తెలంగాణ ప్రాంతానికి చెందిన ఒక అధికారిని ఉద్యేశ్య పూర్వకంగా ఆదిలాబాద్ లో పోస్టింగ్ ఇవ్వడం జరిగిందని తెలిపారు.. ఐ. పి. ఎం. డైరెక్టర్ డా. శివలీల, పి. ఎం. ఎస్. కే కుమార్, అనిల్ కుమార్ ఒక గ్రూప్ గా ఏర్పడి తెలంగాణ ఉద్యోగులకు అన్యాయం చేస్తూ ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఉద్యోగులకు కొమ్ము కాస్తూన్నారని ఐ. పి. ఎం. ఉద్యోగులు ఆరోపిస్తూన్నారు. డా. శివలీల ను బదిలీ చేసేవరకు ఐ. పి. ఎం. లో. అక్రమాలు ఆగే పరిస్థితులు కనిపించడం లేదని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేసారు.

# మద్దులపల్లి మార్కెట్ కమిటీ పాలక వర్గం ప్రమాణ స్వీకారం

**పాల్గోన్న మంత్రులు పొంగులేటి, తుమ్మల**

**ఖమ్మం :** వ్యవసాయ మార్కెట్కు విక్రయానికి వచ్చే రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, మంచి సేవలు అందించేవిధంగా నూతన పాలకవర్గం పని చేయాలని రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్, పాలక వర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు హాజరయ్యారు.చైర్మన్ గా బైరు హరినాథ్ బాబు మరియు ప్రమాణస్వీకారం అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ నూతన వ్యవసాయ కమిటీకి శుభాకాంక్షలు తెలియచేశారు. రాబోయే మూడు నెలల్లోనే ఈ మార్కెట్ యార్డ్ నిర్మాణం పూర్తి చేసి, సంక్రాంతికి ప్రారంభం చేస్తామని అన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎన్నికలలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో 4 గ్యారెంటీ లు పూర్తి చేశామని, రైతులకి రుణ మాఫీ కూడా చేశామని, మిగిలిన రైతులకి కూడ రైతు రుణ మాఫీ చేస్తామని అన్నారు.రాజకీయ లబ్ధి కోసం కొందరు తప్పుగా మాట్లాడుతున్నారని అన్నారు. గత ప్రభుత్వం లక్ష రుణ మాఫీ చేయడానికి 10 సంవత్సరాలు పట్టిందని అన్నారు.రాష్ట్రం మొత్తంలో ప్రతి నియోజక వర్గంలో ఇంటిగ్రిడెడ్ స్కూల్ ప్రారంభించబోతున్నామని అన్నారు. రాబోయే కొద్ది రోజుల్లో ప్రతి నియోజక వర్గానికి 3,500 ఇళు కూడా ఇవ్వబోతుందని, ప్రతి ఇంటికి ప్రభుత్వం 5 లక్షలు ఇస్తుందని అన్నారు. ఆనాటి ప్రభుత్వం వారి పదవుల మీద ఉన్న ఆశ ప్రజల మీద లేదని అన్నారు. బావ బామ్మర్దులు ఇద్దరు వారి ఇళ్లు పోతాయని హైదరాబాద్ లో మూసినది వద్ద దొంగ ఏడుపులు ఏడుస్తున్నారన్నారు. రైతుల కోసం 2024 చట్టం ద్వారా ధరణి సరి చేసి పట్టాలు రాని రైతులకి పట్టాదారు పాస్ బుక్కులు ఇస్తుందని అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి ఒక్కరికీ మేలు చేస్తుందని అన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ పాలేరు నియోజక వర్గానికి గతంలో బై ఎలెక్షన్ లో గెలిచి మూడు సంవత్సరాలలో అభివృద్ధి చేశానన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో మా శక్తి మేర కృషి చేసి మార్కెట్ అభివృద్ధి చేస్తామని అన్నారు. గోదావరి జలాలను పాలేరులో కలిపి నియోజక వర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని అన్నారు. నా చిరకాల మిత్రుడు పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి పాలేరు నియోజక వర్గం అభివృద్ధి చేస్తామన్నారు. వచ్చే పంట నుండి సన్న వడ్లకి 500 రూ బోనస్ అధికంగా ఇస్తామని అన్నారు.పంటలకు ఇన్సూరెన్స్ చేయిస్తామని, పామాయిల్ సాగు చేస్తే, ఇక్కడే ఫ్యాక్టరి పెట్టిస్తామని అన్నారు. ఈ నియోజక వర్గం పచ్చని పొలాలు, ప్రజలు ఆనందంగా ఉండాలని కోరుకుంటన్ననన్నారు. రైతు రుణ మాఫీ చేశామని, రైతులు తల దించుకునే పరిస్థితి రానివ్వమని అన్నారు. ఖమ్మం మార్కెట్ తల దాన్నెలా మద్దులపల్లి మార్కెట్ ని అభివృద్ధి చేస్తామన్నారు. పనికి రాని నియోజక వర్గంగావున్న పాలేరు నియోజక వర్గాన్ని అభివృద్ధి చేశామని ఇంకా అభివృద్ధి చేస్తామని అన్నారు.

# వంజరి కుల విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో రాణించాలి

**తెలంగాణ రాష్ట్ర వంజరి సంఘం డైరెక్టర్ బొమ్మెల శంకర్**

**రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించిన వంజరి కుల విద్యార్థినిలకు నగదు ప్రోత్సాహకాలు అందజేత**

**కోరుట్ల :** వంజరి కుల విద్యార్థులు సమాజంలో విద్యకు ప్రముఖ్యతను గుర్తించి ఉన్నత చదువుల్లో ఉత్తమ ప్రతిభతో రాణించాలని తెలంగాణ రాష్ట్ర వంజరి సంఘం డైరెక్టర్ బొమ్మెల శంకర్ అన్నారు.ప్రతి సంవత్సరం ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర వంజరి సంఘం పదవ తరగతి మొదలుకొని ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జి పి ఏ, స్టేట్ ర్యాంకులు సాధించిన రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తమ వంజరి కుల విద్యార్థినిలకు ఒక్కొక్కరికి నగదు రూ.లు 10,000 ప్రోత్సాహకాలు అందజేస్తుండగా గత విద్యాసంవత్సరం 2023 - 2024 కు గాను జగిత్యాల జిల్లాలో జీపిఏ, స్టేట్ ర్యాంకులు సాధించిన వంజరి విద్యార్థినిలకు రాష్ట్ర సంఘం ద్వారా మంజూరైన నగదు ప్రోత్సాహకాలను జిల్లా నుండి ఎంపికైన 14మంది కుల విద్యార్థినిలకు అందజేసే కార్యక్రమాన్ని శుక్రవారం జగిత్యాల జిల్లా కోరుట్ల మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో రాష్ట్ర వంజరి సంఘం డైరెక్టర్, జగిత్యాల జిల్లా వంజరి సంఘం అధ్యక్షులు బొమ్మెల శంకర్ ఆధ్వర్యంలో రాష్ట్ర డైరెక్టర్ లు ఆరె శంకర్, ముస్కరి తుకారాం లు ఏర్పాటు చేశారు.ఈసందర్భంగా బొమ్మెల శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర వంజరి సంఘం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఉన్నత చదువుల్లో రానించిన వంజరి భావితరాల విద్యార్థులకు తన చేతులమీదుగా ఈ ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేయడం తనకు సంతోషంగా ఉందని అన్నారు. సామజిక వెనుకబాటుతనాన్ని అనుభవిస్తున్న వంజరి కుసుమాలు పోటీ ప్రపంచంలో ప్రభుత్వ పాఠశాలలు కళాశాలల్లో, సాధారణ విద్యాసంస్థలలో చదివినా కార్పొరేట్ విద్యాసంస్థల విద్యార్థులకు దీటుగా చదువుల్లో రానిస్తూ ఉత్తమ ప్రతిభను చాటుతున్నారని అన్నారు. అయితే పాలకులు,ప్రభుత్వాలు గుర్తించి చేయూతనిస్తే వంజరి కుల విద్యార్థులు మరింత మెరుగ్గా చదివి సమాజానికి ఉపయోగపడుతూ దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తారని ఆయన పేర్కొన్నారు.వంజరి విద్యార్థులు ఇదే స్ఫూర్తితో మరిన్ని పోటీ పరీక్షల్లో నెగ్గి జీవితంలో డాక్టర్లుగా, ఇంజనీర్, శాస్త్రావేత్తలుగా దేశానికి సేవచేయాలనీ బొమ్మెల శంకర్ ఆకాంక్షించారు.అనంతరం నగదు పురస్కారాలను అందుకొన్న 14 మంది విద్యార్థినిలను నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈసందర్భంగా నగదు ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థినిలు వారి తల్లిదండ్రులు తెలంగాణ వంజరి సంఘం అధ్యక్షులు కాలేరు నరేందర్, ప్రధాన కార్యదర్శి కంధారి వెంకటేశం, కోశాధికారి కాలేరు అమరేందర్ మరియు రాష్ట్ర, జిల్లా సంఘాల కార్యవర్గమునకు ధన్యవాదములు తెలిపారు. ఈకార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వంజరి సంఘం డైరెక్టర్ లు ఆరె శంకర్, ముస్కరి తుకారాం, జిల్లా నాయకులు నవాతు రాజేందర్, లవంగ సాగర్, నల్లా వెంకటేశ్వర్లు వివిధ మండలాల నుండి వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## నాంపల్లిలో అమ్మవారి విగ్రహం ధ్వంసం

**హైదరాబాద్ :** ప్రతీ ఏడాది ఎక్కడో దగ్గర హిందు ఆరాధ్య విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారు కొందరు వ్యక్తులు. తెలుగు రాష్ట్రాల్లో ఇది మరీ ఎక్కువ. తాజాగా హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో అమ్మవారి విగ్రహం ధ్వంసం చేశారు గుర్తు తెలియని వ్యక్తులు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎగ్జిబిషన్ సొసైటీ సిబ్బంది ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేశారు. రాత్రి దండియా కార్యక్రమం పూర్తయ్యే వరకూ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఉన్నారు పోలీసులు. అర్థరాత్రి ఎవరూ లేని సమయంలో విగ్రహాన్ని ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు.కరెంట్ ఆపేసి సీసీ కెమెరాలు ధ్వంసం చేసి, ఆపై అమ్మవారి విగ్రహం డ్యామేజ్ చేశారు. అమ్మవారి చేతి విరిగిపడి కింద ఉంది. ఉదయం చుట్టుపక్కలున్న భక్తులు విగ్రహం డ్యామేజ్ అయిన విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న?రు అబిడ్స్ ఏసీపీ చంద్రశేఖర్.ఘటన జరిగిన ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారాయన. వెంటనే కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు బేగంబజార్ పోలీసులు. ఈ ఘటనపై భక్తుల మండిపడుతున్నారు. విగ్రహంపై దాడి చేసిన దుండగులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని పలు హిందు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.గతంలో కాకినాడలో ఇలాంటి ఘటన జరిగింది. దుర్గామాత అమ్మవారి విగ్రహాలను ధ్వంసం చేశారు గుర్తు తెలియని వ్యక్తులు. అప్పట్లో ఈ వ్యవహారంపై పెద్ద రచ్చ అయ్యింది. ఇప్పుడు హైదరాబాద్ వంతైంది.

## తండ్రిని పట్టించుకోని కొడుకు

**కరీంనగర్ :** ఆ తండ్రికి ఇద్దరు కొడుకులు.. వారిద్దరి చూసి తెగ మురిసిపోయేవాడు. తన జీవితం రాజ భోగంగా ఉంటుందని భావించాడు. వారిద్దరు పెద్దవాళ్లయ్యారు.. పెళ్లి చేశాడు. ఇంతలో డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ప్రభుత్వం ఇచ్చింది. ఆ ఇంటిని పెద్ద కొడుకు తన భార్య పేరిట రాయించుకున్నాడు.చివరకు ఆ తండ్రిని రోడ్డు మీదకు గెంత్తేశారు కొడుకులిద్దరు. రోడ్డుపై భిక్షాటన చేస్తూ కడుపు నింపుకునేవాడు. ఈ విషయం ఆయన ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లాడు పెద్దాయన. రంగంలోకి దిగిన అధికారులు, ఆ కొడుకులిద్దరికీ ఊహించని ఝలక్ ఇచ్చారు. ఇంతకీ ఏం జరిగింది?సిరిసిల్లకు చెందిన అదువాల రాజమల్లుకు ఇద్దరు కొడుకులు. ఒకరు అనిల్‌కుమార్ కాగా, మరొకరు సురేశ్. ఈ ఫ్యామిలీకి రెండేళ్ల కిందట గత ప్రభుత్వం తంగళ్లపల్లి మండలంలో డబుల్ బెడ్రూం ఇంటిని కేటాయించింది. ఇంతవరకు బాగానే సాగింది. ఇక్కడే అసలు కథ మొదలైంది.కొడుకుల మైండ్‌లో ఏం ఆలోచన వచ్చిందో తెలీదు. ఆ ఇంటిని రాజమల్లు పేరున ఇవ్వాల్సి ఉండగా పెద్ద కొడుకు అనిల్‌కుమార్ తన భార్య పేరిట రాయించుకున్నాడు. చివరకు కన్నతండ్రి ఇంట్లో నుంచి బయటకు గెంత్తేశారు.తొలుత ఈ విషయాన్ని ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లాడు రాజమల్లు. అధికారుల నుంచి ఎలాంటి సమాధానం లేకపోవడంతో పెద్దాయన రోడ్లపై భిక్షాటన చేసి కడుపు నింపుకునేవాడు. ఈ వ్యవహారంపై అధికారులు అంతర్గతంగా విచారణ చేపట్టారు.తంగల్లపల్లి ఎమ్మార్వో పూర్తి స్థాయి విచారణ చేసి ఆర్డీవో రమేశ్‌కు నివేదిక ఇచ్చారు. రంగంలోకి దిగిన ఎమ్మార్వో, ఆర్డీఓలు నేరుగా రాజమల్లు ఇంటికి వెళ్లారు. వారం రోజుల్లో ఇంటిని ఖాళీ చేసి తండ్రికి అప్పగించాలని ఆదేశించారు ఆర్డీఓ. అంతేకాదు కొడుకులిద్దరూ ప్రతీ నెల రెండు వేలు చొప్పున చెల్లించాలన్నది ప్రధాన పాయింట్.డబుల్ బెడ్రూమ్ ఇంటిని రాజమల్లు పేరున మార్చాలని తహసీల్దారు ఆదేశించారు. కొడుకు అనిల్ కుమార్‌కు నోటీసులు ఇచ్చారు. తనకు పూర్తి స్థాయిలో న్యాయం చేసిన అధికారులకు రాజమల్లు కృతజ్ఞతలు తెలిపారు. తల్లిదండ్రులను పట్టించుకోని కొడుకులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆర్డీవో రమేష్ అన్నారు.

## సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా ఆయుధపూజ

**పోలీస్ అధికారులకు సిబ్బందికి దసరా పండుగ శుభాకాంక్షలు**

**పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ**

**సిద్దిపేట :** సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పెద్దకోడూర్ గ్రామ శివారులోగల సాయుధ దళాల కార్యాలయంలో పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ, దుర్గదేవి అమ్మవారి నవరాత్రులులో భాగంగా ఆయుధాలకు, ప్రభుత్వ వాహనాలకు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా పూజలు చేశారు, మరియు జమ్మి చెట్టుకు పూజలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చేసే ప్రతి పనిలో అధికారులు సిబ్బంది విజయం సాధించాలని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. శాంతిభద్రల పరిరక్షణలో నేరాల నియంత్రించడంలో జిల్లా పోలీస్ శాఖ ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు, దుర్గమాత కరుణాకటాక్షాలు జిల్లా పోలీసులకు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షిస్తూ పూజలు నిర్వహించడం జరిగింది చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమి పండుగను జరుపుకోవడం అలనాటి నుంచి వస్తున్న సంప్రదాయం సమాజంలో చెడును పారదోలెందుకు పోలీస్ విభాగం నిరంతరం కృషి చేస్తుందన్నారు. పోలీస్ అధికారులకు మరియు సిబ్బంది, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపిలు రాంచంద్రరావు, సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట ఏసిపి మధు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ధరణి కుమార్, పూర్ణ చందర్, ప్రసాద్, రాజేష్, విష్ణు ప్రసాద్, ఆర్ఎస్ఐలు రోహిత్, రంజిత్, బాలకృష్ణ, అంజయ్య, చిన్నకోడూర్ ఎస్ఐ బాలకృష్ణ, ఏఆర్ అధికారులు సిబ్బంది మరియు సాయుధ దళ పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభలో ప్రతిపక్షాలకు అరుదైన గౌరవం

**వేదికపైకి ఆహ్వానించి సభలో మాట్లాడించే అవకాశం కల్పించిన డిప్యూటీ సీఎం**

ఎన్నికల సమయంలోనే రాజకీయాలు ..ఎన్నికల తర్వాత అభివృద్ధి ప్రధానమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు గారు బలంగా విశ్వసిస్తారు. దీనికి నిదర్శనమే శుక్రవారం మధిర నియోజకవర్గం లక్ష్మీపురం గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి సందర్భంగా ఏర్పాటు చేసిన వేదిక పైకి ప్రతిపక్ష పార్టీల నాయకులను ఆహ్వానించి అరుదైన గౌరవం ఇచ్చారు. సిపిఐ పార్టీ నుంచి జితేందర్ రెడ్డి, సిపిఎం పార్టీ నుంచి పొన్నం వెంకటేశ్వరరావు, బిఆర్ఎస్ పార్టీ నుంచి ముత్తారం వెంకటి లను వేదిక పైకి ఆహ్వానించడమే కాకుండా వారితో మాట్లాడించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో వారు వ్యవహరించే హుందాతనం, గొప్పతనం గురించి సభలో మాట్లాడుకోవడం విశేషంగా వినిపించింది. ప్రజా స్వామ్య విలువలకు వారిచ్చే గౌరవం గురించి అంతా చర్చించుకున్నారు.. ప్రతిపక్ష పార్టీల నాయకుల సైతం వేదికపైకి ఆహ్వానించి గౌరవించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.


## ఒకేసారి వందకు పైగా పూసిన బ్రహ్మ కమలాలు

**ఖమ్మం :** ఖమ్మం జిల్లా రూరల్ మండలం తల్లంపాడులో బ్రహ్మ కమలాలు వికసించాయి.గ్రామానికి చెందిన కొండ మీది సత్యనారాయణ ఇంట్లో ఉన్న బ్రహ్మ కమలం చెట్టు ఒకేసారి వందకు పైగా పువ్వులు పూసింది.అద్భుతమైన వాసనతో ఉండే బ్రహ్మ కమలం అర్ధరాత్రి సమయంలో వికసించి కేవలం కొన్ని గంటలు మాత్రమే ఉండి వాడిపోతాయి.బ్రహ్మ కమలాలు గత నాలుగేళ్లుగా సత్యనారాయణ ఇంట్లో పూస్తున్నాయి.ప్రతీ సారి కేవలం ఒక ఐదు నుండి పది లోపు పూసే పువ్వులు ఈసారి మాత్రం ఏకంగా వందకు పైగా పూలు పూయడం ఆశ్చర్యాన్ని కలిగించిందని చెపుతున్నారు. గత రెండు సంవత్సరాల నుంచి ఈ పూలు ఏదో ఒక పండుగ సందర్భంగానే పూయడం గమనార్హం. ఈసారి దేవీ నవరాత్రుల సందర్భంగా పెద్ద సంఖ్యలో పువ్వులు పూయడంతో సత్యనారాయణ కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు కూడా ఆసక్తిగా తిలకిస్తున్నారు.

## లక్ష్మీపురంలో యంగ్ ఇండియా స్కూలుకు శంకుస్థాపన


**మధిర** అంతర్జాతీయ ప్రమాణాలతో పేద విద్యార్థులకు ఉచితంగా విద్య అందించడానికి ప్రజా ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మకమైన నిర్ణయంలో భాగంగా శుక్రవారం మధిర నియోజకవర్గం బోనకల్ మండలం లక్ష్మీపురం గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు శంకుస్థాపన చేసారు.

# ఈ లక్షణాలు కనిపిస్తే అస్సలు నిర్లక్ష్యం వద్దు.!



ప్రపంచవ్యాప్తంగా 84 కోట్ల మంది దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నారు. అంటే ప్రతి పదిమందిలో దాదాపు ఒకరికి కిడ్నీ వ్యాధి ఉంది. ఇండియన్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజీ ఇచ్చిన తాజా రిపోర్ట్ ఇది. ఈ మధ్యకాలంలో మరణాలకు కారణమవుతున్న అతి ప్రధానమైన జబ్బులలో క్రానిక్ కిడ్నీ డిసీజ్ ఏడవ స్థానంలో ఉంది. ఒక్క ఇండియాలోనే ప్రతి సంవత్సరం రెండు లక్షల నుంచి 3 లక్షల మంది కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నట్టు ఇండియన్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజీ అధ్యయనంలో తెలిసింది. దీనికి ప్రధాన కారణం కిడ్నీ సంబంధిత వ్యాధులను ప్రాథమిక దశలో గుర్తించకపోవడం అని, సమస్య ఎక్కువైన తర్వాత ఇది బయటపడుతోందని వైద్యులు అంటున్నారు. మన జీవన శైలి, తీసుకునే ఆహారం, అలవాట్లు, వంశపారంపర్య సమస్యలు, అనవసరమైన మెడిసిన్ తీసుకోవడం, ఇతర ఆరోగ్య సమస్యలు కిడ్నీల పనితీరుపై ప్రభావం చూపుతుంది. కిడ్నీ పనితీరు తగ్గిపోయి, శరీరంలోని వ్యర్థాల తొలగింపు సరిగ్గా లేకపోవడంతో కొన్ని రకాల కిడ్నీ వ్యాధులు వచ్చే అవకాశం ఏర్పడుతుంది. కిడ్నీ సమస్యతో వచ్చే వ్యాధిలో దీర్ఘకాలిక ముత్ర పిండాల వ్యాధి ఒకటి.. ఈ వ్యాధికి గురైతే చాలా కాలం బాధపడాల్సి ఉంటుంది. మధుమేహం, హైబీపీ ఉన్నవారికి ఇది సాధారణంగా సోకుతుంది. ఆకలి లేకపోవడం, పాదాలు, చీలమండలం వద్ద వాపు, తక్కువగా శ్వాస తీసుకోవడం, నిద్ర సరిగ్గా లేకపోవడం, ఎక్కువగా లేదా తక్కువగా మూత్ర విసర్జన ఉండటం ఈ వ్యాధి లక్షణాలు. కిడ్నీలో పేరుకుపోయే ఉప్పు లేదా ఇతర స్ఫటికాలను మూత్రపిండాల్లో రాళ్లుగా పిలుస్తారు. మూత్ర విసర్జన సమయంలో నొప్పి, మూత్రంలో రక్తం, రాయి ఉన్న భాగంలో నొప్పి, ఇలాంటి లక్షణాలు కనిపిస్తే కిడ్నీలో రాళ్ల ఉన్నట్టుగా గమనించాలి. డయాబెటిస్ ఉన్న ప్రతి ముగ్గురిలో ఒకరికి కిడ్నీ వైఫల్యానికి దారితీస్తున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. ఆకలి లేకపోవడం, వాంతులు, బాగా నీరసంగా ఉండటం, శరీరం ఉబ్బడం, ఉబ్బసం, వెన్నునొప్పి, మూత్రంలో రక్తం, వెన్నునొప్పి, తల తిరగడం, మెడనొప్పి, వికారం, వాంతులు లాంటి లక్షణాలు గమనిస్తే కిడ్నీ సమస్య వస్తున్నట్లు అర్థం చేసుకోవాలి.

# హార్ట్ బ్లాక్ అంటే ఏమిటో తెలుసా..?



గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారిలో 95 శాతం మంది గుండెపోటుతో మరణిస్తున్నారు. వైద్యులు సాధారణంగా గుండెపోటును నిర్ధారించడానికి యాంజియోగ్రఫీని సిఫార్సు చేస్తారు. ఈ పరీక్ష తర్వాత, గుండెలో అడ్డుపడటం (హార్ట్ బ్లాక్) 70, 80 లేదా 90వ శాతంగా నివేదిస్తారు. గుండెలో అడ్డంకులు ఏర్పడితే గుండెపోటు వచ్చే ప్రమాదం కూడా ఎక్కువగా ఉంటుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. దీనిని దశల వారిగా విభజిస్తారు. గుండెలోని రక్త నాళాల్లో రక్త ప్రసరణకు అడ్డంకులు ఏర్పడటం, రక్తనాళాలు పూడుకుపోవడం, రక్తాన్ని గుండె సరిగా సరఫరా చేయలేకపోవడం తదితర కారణాల వల్ల గుండెపోటు వస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. గుండెలో అడ్డుపడటాన్ని అథెరోస్క్లెరోసిస్ అని కూడా పిలుస్తారు. గుండె అడ్డుపడటం మొదటి దశ.. - ధమనులలో ఫలకం ఏర్పడటం. కొవ్వు, కొలెస్ట్రాల్, ఇతర పదార్థాలతో తయారైన ఈ ఫలకం ధమనులను తగ్గిస్తుంది. గుండెకు రక్త ప్రసరణను తగ్గించడంతోపాటు.. అడ్డంకిగా మారుతుంది..95శాతంగా పేర్కొంటే.. ప్రమాదంలో ఉన్నట్లు అర్థం. ఒక్కోసారి వైద్య అత్యవసర పరిస్థితి కూడా ఏర్పడవచ్చు.. హృదయంలో 95 శాతం హార్ట్ బ్లాక్ అయినప్పుడు.. శరీరంలో కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. అవేంటో తెలుసుకోండి.. ఛాతీలో భారంగా అనిపించడం: గుండె ధమనులలో అడ్డుపడినప్పుడు, ఛాతీ బరువుగా అనిపిస్తుంది. ఇది ఛాతీ గట్టిగా ఉన్నట్లు అనిపిస్తుంది. ఇలా జరిగినప్పుడు చాలా మంది సాధారణం అని అనుకుంటారు. గుండె సక్రమంగా కొట్టుకోలేకపోవడంతో ఇలాంటి లక్షణాలు కనిపిస్తే సాధారణమైనది కాదని గ్రహించాలి.. ఛాతీ నొప్పి: గుండెపోటు విషయంలో, రోగులు తీవ్రమైన ఛాతీ నొప్పిని అనుభవిస్తారు. ఈ స్థితిలో శరీరంలో రక్తప్రసరణ సరిగా జరగదు. దీని వల్ల ఛాతీ నొప్పి వస్తుంది. అప్పుడు ఛాతీ గట్టిగా - బరువుగా మారుతుంది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది: గుండెపోటు వచ్చినప్పుడు, రోగి శరీరంలో ఆక్సిజన్ కొరత ఏర్పడుతుంది. శ్వాస తీసుకోవడం కష్టంగా మారితే, నిర్లక్ష్యం చేయకండి. వెంటనే వైద్యుడిని సంప్రదించండి. అలసట: గుండె ధమనులు మూసుకుపోయినప్పుడు.. ఒక వ్యక్తి ఎటువంటి కారణం లేకుండా అలసిపోతాడు. చాలా మైకము లేదా బలహీనంగా అనిపిస్తుంది. వాంతులు, వికారం వంటి ఫిర్యాదులు వస్తాయి.. ఇలాంటి సందర్భంగా అప్రమత్తంగా ఉండాలి.. దంతాలు - దవడలలో నొప్పి: గుండెపోటు విషయంలో, రోగులకు ఛాతీలో నొప్పి రావడం సాధారణం. కానీ క్రమంగా ఈ నొప్పి దవడల వరకు చేరుతుంది. ఇదే జరిగితే, ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించండి.

# వంటల్లో అధికంగా చింతపండు వాడుతున్నారా?



కొన్ని వంటలకు చింతపండు లేకుంటే రుచి బాగోదు. మన వంటలలో దీని ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుంది. చింతపండును రకరకాల వంటల్లో ఉపయోగిస్తుంటారు. చింతపండు రుచి పుల్లగా ఉంటుంది. అందుకే పేరు చెప్పగానే నోటి నుంచి లాలాజలం కారుతుంది. అందుకే పలు రకాల వంటల్లో చింతపడు లేకుండే అసంపూర్ణంగా అనిపిస్తుంది. చింతపండులోలో టార్టారిక్ యాసిడ్, ఎసిటిక్ యాసిడ్, సక్సినిక్ యాసిడ్, పెక్టిన్, టానిన్లు, ఆల్కలాయిడ్స్, ఫ్లేవనాయిడ్స్, గ్లైకోసైడ్లు ఉంటాయి. పోషకాహార నిపుణుల అభిప్రాయం ప్రకారం, రోజుకు 10 గ్రాముల చింతపండు తీసుకోవడం సురక్షితం. ఇంతకన్నా తక్కువ పరిమాణంలో తీసుకున్నా మంచిదే. చింతపండు ఎక్కువగా తీసుకుంటే అనేక సమస్యలు వస్తాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. చింతపండు ఎక్కువగా తీసుకోవడం వల్ల దంతాల నిర్మాణం దెబ్బతింటుంది. పళ్లపై ఉండే ఎనామెల్ దెబ్బతింటుంది. దంతాలు కూడా బలహీనంగా మారవచ్చు. చింతపండులో టానిన్‌లతో సహా అనేక సమ్మేళనాలు ఉంటాయి. వీటిని జీర్ణం చేసుకోవడం కొంచెం కష్టం. అధిక పరిమాణంలో చింతపండు తీసుకుంటే, కడుపు, జీర్ణశయాంతర ప్రేగులలో యాసిడ్ స్థాయిని పెంచుతుంది. ఇది గ్యాస్, యాసిడ్ రిఫ్లక్స్, ఇతర కడుపు సమస్యలను కలిగిస్తుంది. చింతపండును అధిక మోతాదులో తీసుకోవడం వల్ల శరీరంలో బ్లడ్ షుగర్ లెవల్స్ తగ్గుతాయి. మైకం, బలహీనత ఆవహిస్తాయి. గ్లూకోజ్ స్థాయిలను తగ్గించడానికి ఇప్పటికే మందులు వాడుతున్న వారు చింతపండు తీసుకోవడం అంతమంచిది కాదు. గర్భధారణ సమయంలో చింతపండుకు దూరంగా ఉండటం మంచిది. చింతపండు తీసుకోవడం గర్భిణీ స్త్రీలకు అంత మంచిది కాదు. ఎందుకంటే దీన్ని ఎక్కువగా తింటే శరీరంలో ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఇది కడుపులో పెరుగుతున్న శిశువుపై ప్రభావం చూపుతుంది. అంతేకాదు పాలిచ్చే తల్లులు కూడా చింతపండు తినకూడదు.

# షుగర్ వ్యాధిగ్రస్తులు దానిమ్మ పండు తింటే ఏం జరుగుతుందో తెలుసా?



దానిమ్మ పండు వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు లాభాలు ఉన్నాయి అన్న సంగతి మన అందరికీ తెలిసిందే. వీటిని చిన్నపిల్లల నుంచి పెద్దవారి వరకు వచ్చి ఒక్కరు ఇష్టపడి తింటూ ఉంటారు. కొందరు వీటిని నేరుగా తింటే మరికొందరు జ్యూస్ చేసుకుని తాగుతూ ఉంటారు. అయితే దానిమ్మ పండు ను తరచుగా తీసుకోవడం వల్ల ఎన్నో రకాల లాభాలను పొందవచ్చని ఆరోగ్య నిపుణులు సైతం చెబుతున్నారు. ఇకపోతే చాలామంది సుగర్ వ్యాధిగ్రస్తులు దానిమ్మ పండు తినవచ్చా తినకూడదా? ఒకవేళ తింటే ఏం జరుగుతుంది ఎక్కువగా తింటే ఏమైనా అవుతుందా అన్న సందేహాలు వస్తూ ఉంటాయి. దానిమ్మలో సహజంగా పోషకాలు పుష్కలంగా ఉన్నాయి, ఇది మొత్తం ఆరోగ్యం, జీవక్రియ, రోగనిరోధక శక్తి మరియు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. మీ రోజువారీ ఆహారంలో దానిమ్మ పండును చేర్చుకోవాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దానిమ్మ పండులో రక్తం గడ్డ కట్టడానికి ఎముకలు ఆరోగ్యంగా ఉండడానికి ఉపయోగపడే విటమిన్ కె ఉంటుందట. ఈరోజు వారి ఆహారంలో దానం మనం చేర్చుకోవడం వల్ల అనేక రకాల ప్రయోజనాలను పొందవచ్చు అని చెబుతున్నారు. దానిమ్మ తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి ఉంటాయి. అవి రక్తంలో చక్కెర స్థాయిలపై తక్కువ ప్రభావాన్ని చూపుతాయి. తక్కువ +× ఆహారాలు సాధారణంగా మధుమేహ వ్యాధిగ్రస్తులకు మంచివి ఎందుకంటే అవి రక్తంలో గ్లూకోజ్ నెమ్మదిగా పెరగడానికి కారణమవుతాయట. దానిమ్మ పండులో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ముఖ్యంగా పాలీ ఫెనాల్స్, మంటను తగ్గించడం, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడం వంటి ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉండవచ్చని చెబుతున్నారు. ఫైబర్ కంటెంట్ దానిమ్మ డైటరీ ఫైబర్ యొక్క మంచి మూలం, ఇది చక్కెర శోషణను మందగించడం ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచడం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. దానిమ్మ పండులో విటమిన్ సి, కె పొటాషియం వంటి అవసరమైన విటమిన్లు ఖనిజాలు ఉన్నాయి, ఇవి మొత్తం ఆరోగ్యానికి మేలు చేస్తాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులకు దానిమ్మపండ్లు ఆరోగ్యకరమైన ఆహారంలో భాగం అయినప్పటికీ, వాటిని మితంగా తీసుకోవాలి.

# డార్క్ చాక్లెట్.. ఆరోగ్య ప్రయోజనాలు




డార్క్ చాక్లెట్ తినడం వల్ల మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి. తీవ్ర మానసిక ఒత్తిడితో పాటు ఆందోళన వంటి సమస్యలను నివారించవచ్చు. మానసికంగా ఎంతో ఆనందాన్ని కూడా పొందవచ్చునని అధ్యయనం తేల్చింది. డార్క్ చాక్లెట్‌లో ఫెనిలేథైలమైన్ వంటి సైకోయాక్టివ్ పదార్థాలు ఉంటాయి. వీటిలో మానసిక స్థితిని నియంత్రించే న్యూరోమోడ్యులేటర్ ఉంటుది. చాక్లెట్ తినేవారిలో చాలా కాలం తర్వాత మానసిక స్థితి మెరుగుపడినట్టు గుర్తించారు. ప్రతిరోజూ కొద్ది మొత్తంలో డార్క్ చాక్లెట్ తినే వారిలో ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్, రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉండటంతో పాటు గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని కూడా తగ్గించినట్టు పరిశోధకులు కనుగొన్నారు. అంతేకాదు.. బరువు, శరీర కొవ్వు కూడా తగ్గినట్టు గుర్తించారు.డార్క్ చాక్లెట్ రోజుకు అర ఔన్స్ మాత్రమే తీసుకోవాలి. ఆ మొత్తానికి మించి తీసుకున్నా పెద్దగా ప్రభావం కనిపించలేదు. అలాగే, గుండె సంబంధ వ్యాధుల నివారణ అధ్యయనంలో కూడా 0.7 నుంచి 1.5 ఔన్సుల మధ్య తీసుకున్నారు. కొన్ని డార్క్ చాక్లెట్‌లు రుచికి బాగుంటాయి. వీటిలో 40 శాతం కోకో సాలిడ్‌లు ఉంటాయి. అందుకే డార్క్ చాక్లెట్ డార్క్‌గా కనిపించడానికి కారణంగా చెప్పవచ్చు. అధ్యయనాల్లో కనీసం 60 శాతం కోకో ఘనపదార్థాలను కలిగిన డార్క్ చాక్లెట్ నుంచి అతిపెద్ద ప్రయోజనాలను పొందవచ్చునని తేలింది.

# పిల్లలు 'జెమ్స్' తింటున్నారా?



చిన్న పిల్లలు సాధారణంగా పిప్పరమెంట్లు, చాక్లెట్స్, జెమ్స్ వంటివి తింటూ ఉంటారు. ఆ వయస్సులో ఎవరైనా వాటికి ఆకర్షితులు అవుతారు, అందులో ఎలాంటి అతిశయోక్తి లేదు. అయితే కొన్నిటిని కచ్చితంగా దూరం పెట్టాల్సిన అవసరం ఉంది. వాటి వల్ల ఆరోగ్యం ప్రమాదంలో పడే ప్రమాదం ఉంటుంది. అలా దూరం పెట్టాల్సిన వాటిల్లో మొదటిది జెమ్స్. మీ ఇంట్లో పిల్లలు ఎక్కువగా వీటిని తింటుంటే వాళ్ళ చేత వెంటనే ఆ అలవాటుని మానిపించండి. ఇందులో వాడే పదార్థాలు చాలా డేంజర్. జెమ్స్ ప్యాకెట్ వెనుక మనకి ఎలాంటి పదార్దాలు వాడారు, ఏ కెమికల్స్ ఉపయోగించారు అనేవి పూర్తి వివరాలతో అందిస్తారు. ఇందులో ఎమెల్సీఫైర్స్(414 ,442, 476) అనే కెమికల్ చాలా డేంజర్. ఎలాంటి కలర్స్ ఉపయోగించారు అనేది కూడా అందులో వివరంగా ఉంటుంది. కలర్స్ ని నంబర్స్ ఫార్మటు లో పెడుతారు. 171,102, 133 , 124,127,122,132 ,110 అని ఉంటుంది. వీటిల్లో 171 అనగా తెలుపు రంగు. తెలుపు కలర్ పేరు టైటానియం డయాక్సైడ్. ఈ కెమికల్ ని యూరోపియన్ కంట్రీ లో బ్యాన్ చేసారు. ఈ తెలుగు ఎంత ప్రమాదకరమంటే, మన శరీరం లోని %ణచీూ% ని పూర్తిగా నాశనం చేస్తుంది. అందుకే ఇది ఇతర దేశాలలో బ్యాన్ చేయబడింది. అలాగే 102 అనగా పసుపు రంగు. దీనిని టెట్రాజైన్ అని పిలుస్తారు , ఈ కెమికల్ ని నార్వే దేశం బ్యాన్ చేసి చాలా కాలమే అయ్యింది. ఈ కెమికల్ కారణంగా మనకి ఆస్తమా వంటి సమస్యలు వస్తుంటాయి. 133 అనగా నీలి రంగు, దీనిని జర్మనీ వాళు బ్యాన్ చేసారు. ఈ కెమికల్ ని ఉపయోగించడం వల్ల దురద వంటి సమస్యలు వస్తాయి. అలాగే 124 ,127 , 122 నంబర్లు ఎరుపు రంగుని సూచిస్తాయి. వీటిని అమెరికా లో బ్యాన్ చేసారు. ఇలా ఇన్ని దేశాల్లో బ్యాన్ చేసిన ఈ కెమికల్స్ ని మన భారతదేశం లో మాత్రం బ్యాన్ చేయలేదు. వాటి అన్నిటిని కలిపి మనం తినేస్తాము, ఇక మన శరీరం లో ఎన్ని రోగాలకు భీజం పడుతుందో మీరే ఆలోచించండి. 5 లేదా 10 రూపాయలకు అందుబాటులోకి వచ్చేస్తుంది, చాలా రుచికరంగా ఉన్నాయని ఇష్టమొచ్చినట్టు పిల్లల చేత తినిపిస్తే వాళ్ళ ఆరోగ్యాన్ని మీ చేతులారా చెడగొట్టిన వాళ్ళు అవుతారు. దయచేసి ఇది గమనించగలరు. పిల్లలకు అసలు బయట ఆహారాలను అలవాటు చేయడం మెల్లిగా తగ్గించండి. ఎందుకంటే ప్రతీ పదార్థాన్ని తయారు చేయడానికి ఎదో ఒక కెమికల్ ని ఉపయోగిస్తారు. అవి శరీరంలోకి వెళ్లిన తర్వాత లేనిపోని రోగాలు వస్తుంటాయి.



# తర్వాలో వెంకీ పార్ట్-2

ఢీ, రెడీ, దూకుడు వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను తెరకెక్కించిన శ్రీనువైట్ల గత కొంతకాలం నుంచి రేసులో వెనుకబడ్డాడు. ఫార్ములా కథలకు కాలం చెల్లడంతో శ్రీనువైట్ల కమ్‌బ్యాక్ కాలేకపోతున్నాడు. అయితే వినోదాన్ని పండించడంలో ఈ దర్శకుడికి ఓ పత్యేక శైలి. ఇప్పటికి ఢీ, రెడీ, దూకుడు, నమో వెంకటేశ లాంటి చిత్రాల్లో కామెడి ఎపిసోడ్స్ యూట్యూబ్‌ల్లో ట్రెండింగ్‌లో వుంటాయి. ఇక చాలా కాలం తరువాత శ్రీనువైట్ల గోపీచంద్‌తో 'విశ్వం' అనే సినిమాను తెరకెక్కించాడు. ఈ రోజు ఆ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చింది. దాని తుదిఫలితం కూడా కొన్ని గంటల్లో తేలిపోతుంది. అయితే చిత్రంలో యాక్షన్‌తో పాటు తన శైలి వినోదం కొత్తగా వుంటుందని, కామెడీని పండించడంలో తనది అప్‌డేటెడ్ వెర్షన్ ఇందులో చూపిస్తానని కాన్ఫిడెంట్‌గా చెబుతున్నాడు దర్శకుడు. అయితే ఈ చిత్రం తరువాత ఆయన రవితేజతో తీసిన వెంకీ చిత్రానికి సీక్వెల్‌ను రూపొందిస్తానని అంటున్నాడు. ఇటీవల ఆయన మీడియాతో మాట్లాడుతూ 'వెంకీ లాంటి వినోదాత్మక చిత్రాన్ని తెరకెక్కించాలనే ఆలోచనలో వున్నాను. సెకండాఫ్‌లో క్రైమ్ కామెడీతో పాటు చిన్న సస్పెన్స్ వుంటుంది. కానీ వినోదాన్ని మాత్రం డబుల్‌డోస్‌లో జోడిస్తా. ఫస్టాఫ్‌లో మించిన కామెడీ సెకండాఫ్‌లో వుంటుంది. ప్రేక్షకులు కడుపుబ్బా నవ్వుకుని ఎంజాయ్ చేసే విధంగా సన్నివేశాలను ప్లాన్ చేస్తున్నాను. వెంకీ కథ నుంచి ప్రేరణ పొంది ఈ కథను రాసుకున్నాను. వెంకీ కంటే పది రెట్లు మించిన కథ ఇది' అన్నారు. అయితే ఈ సినిమా వెంకీకి సీక్వెల్‌గానే వుంటుంది కానీ, దీనికి ఆ కథకు సంబంధం వుండదని సమాచారం. వెంకీ సీక్వెల్ ప్లాన్‌ను రవితేజకు చెప్పగానే అంగీకరించారని, సినిమాను తన స్నేహితులతో కలిసి శ్రీనువైట్ల నిర్మిస్తాడని తెలుస్తున్నది.



## నిఖిల్ 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' టీజర్ రిలీజ్

టాలీవుడ్ యువ నటుడు నిఖిల్ సిద్ధార్థ్ నటిస్తున్న తాజా చిత్రం 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' ఈ సినిమాకు స్వామిరారా దర్శకుడు సుధీర్ వర్మ దర్శకత్వం వహిస్తుండగా.. ఛత్రపతి, డార్లింగ్ లాంటి బ్లాక్ బస్టర్ అందుకున్న టాలీవుడ్ టాప్ బ్యానర్ శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ప్రొడక్షన్స్‌పై బివిఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నాడు. ఈ మూవీని దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా తాజాగా టీజర్‌ను విడుదల చేసింది. టీజర్ చూస్తుంటే.. ఈ సినిమాలో నిఖిల్ రేసర్‌గా కనిపించబోతున్నాడు. హైదారాబాద్‌లోని ఒక బస్తిలో ఉండే నిఖిల్ లండన్ వెళ్లి ఒక తెల్ల పిల్లను ప్రేమలో పడేసి లైఫ్‌లో సెటిల్ అయిపోదాం అనుకుంటాడు. అయితే దీనికోసమే లండన్ వెళ్లిన నిఖిల్‌కు అక్కడ ఎదురైన సంఘటనలు ఏంటి అనేది ఈ మూవీ స్టోరీ అని తెలుస్తుంది. ఓ లవ్ స్టోరీతో పాటు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ కూడా ఉండబోతున్నట్లు టీజర్ చూస్తే అర్థమవుతుంది. ఇక కన్నడ చిత్రం సప్త సాగరాలు దాటి సినిమాతో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు దక్కించుకున్న రుక్మిణి వసంత్ ఈ సినిమాలో కథానాయికగా నటిస్తుంది.



## 'బలగం' దర్శకుడి కొత్త మూవీ..


### 'ఎల్లమ్మ' షూటింగ్ అప్‌డేట్ ఇచ్చిన దిల్ రాజు

గత ఏడాది చిన్నసినిమాగా విడుదలై బ్లాక్ బస్టర్ అందుకున్న చిత్రం 'బలగం' తెలంగాణలోని కుటుంబ మూలాలు, భావోద్వేగాల నేపథ్యంలో వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకోవడమే కాకుండా విమర్శకుల ప్రశంసలు అందుకుంది. కమెడియన్ వేణు ఎల్దండి దర్శకత్వం (డెబ్యూ) వహించిన ఈ చిత్రంలో ప్రియదర్శి కావ్య కల్యాణ్ రామ్ హీరోహీరోయిన్లుగా నటించగా.. వేణు ఎల్దండి, మురళీధర్ గౌడ్, జయరామ్, రూప, రచనా రవి కీలక పాత్రల్లో కనిపించారు. అయితే ఈ సినిమా అనంతరం అందరిచూపు దర్శకుడు వేణుపై పడిన విషయం తెలిసిందే. బలగం లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత వేణు ఎలాంటి సినిమా తీయబోతున్నాడు అని సినీ ప్రేక్షకులు ఎదురుచూస్తుండగా.. తన తర్వాతి ప్రాజెక్ట్ 'ఎల్లమ్మ' అంటూ అందరికి షాక్ ఇచ్చాడు. అయితే 'ఎల్లమ్మ' అంటూ వస్తున్న ఈ ప్రాజెక్ట్ ఎలా ఉండబోతుంది ఎవరు లీడ్ రోల్ చేయబోతున్నారు అనేది సస్పెన్స్‌గా మారింది. అయితే ఈ సినిమాలో నాని  లేదా నితిన్ హీరోగా నటించబోతున్నట్లు సమాచారం. ఇక ఈ ప్రాజెక్ట్ అనౌన్స్ చాలా రోజులు అయిన ఇప్పటివరకు ఎటువంటి అప్‌డేట్ ఇవ్వలేదు. ఇదిలావుంటే చాలా రోజుల తర్వాత ఎట్టకేలకు ఈ మూవీకి సంబంధించి ఒక అప్‌డేట్ వచ్చింది. ఒక మూవీ ఈవెంట్‌లో బలగం వేణుని నిర్మాత దిల్ రాజు అడుగుతూ.. ఎల్లమ్మ ఎప్పుడు ఉంటుందని ప్రశ్న వేస్తాడు. దీనికి వేణు సమాధానమిస్తూ.. సార్ అంతా మీ చేతుల్లోనే ఉంది మీరు ఇప్పుడు మొదలుపెట్టమన్నా స్టార్ట్ చేస్తాను. నవంబర్ నుంచి స్టార్ట్ చేద్దామా అని అడుగగా.. వద్దు సామీ ఫిబ్రవరి నుంచి స్టార్ట్ చేద్దాం అంటూ దిల్ రాజు అంటాడు. దీంతో ఈ ప్రాజెక్ట్‌ను ఫిబ్రవరిలో అధికారికంగా లాంచ్ చేయబోతున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు దిల్ రాజు నిర్మాతగా వ్యవహారించనున్నాడు.

## దసరాకి 'విశ్వంభర' టీజర్!



టాలీవుడ్ అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'విశ్వంభర'. పాన్ ఇండియా స్థాయిలో సోషియో ఫాంటసీ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు బింబిసార' ఫేమ్ వశిష్ట దర్శకత్వం వహిస్తుండగా.. కోలీవుడ్ స్టార్ హీరోయిన్ త్రిష దాదాపు 18 ఏండ్ల తర్వాత చిరంజీవితో కలిసి ఇందులో నటిస్తుంది. ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న విషయం తెలిసిందే. ఇప్పటికే సగానికి పైగా షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం రెండు పాటలు, క్లైమాక్స్ షూట్ మిగిలిఉన్నట్లు తెలిపింది. ఈ సినిమాను 2025 సంక్రాంతి కానుకగా తీసుకురానున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఇక విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రమోషన్స్ మొదలుపెట్టనుంది చిత్రబృందం. అయితే ఈ సినిమా టీజర్‌ను దసరా కానుకగా విడుదల చేయనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. చెప్పినట్లుగానే మేకర్స్ దసరా పండుగనాడు ఈ మూవీ టీజర్‌ను వదలబోతున్నట్లు తెలుస్తుంది. దీనికి సంబంధించి ఇప్పటికే సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ విక్రమ్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి ఆర్ఆర్ఆర్ ఫేం లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి బ్యాక్ గ్రౌండ్ స్కోర్, సంగీతం అందిస్తున్నారు.



## శృతి హాసన్ అసహనం..

గ్లామర్ డాల్ శృతి హాసన్ రీ ఎంట్రీలో సక్సెస్ ఫుల్‌గా దూసుకెళుతోంది. రీసెంట్‌గా ఆమె నటించిన 'సలార్' చిత్రం మంచి విజయం సాధించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం టాలీవుడ్ పరంగా ఆమె చేతిలో 'సలార్ 2' చిత్రం మాత్రమే ఉంది. కోలీవుడ్‌లో కూడా ఆమెకు ఏం ఆఫర్లు వచ్చినట్లుగా లేవు. కారణం ఆమె చాలా సెలక్టెడ్‌గా సినిమాలను ఎన్నుకుంటోంది. ఇక విషయంలోకి వస్తే.. తాజాగా శృతి హాసన్ ఇండిగో సంస్థపై అసహనం వ్యక్తం చేసింది. ఈ మధ్య ఇండిగో సంస్థ తరచూ వార్తల్లో నిలుస్తోన్న విషయం తెలిసిందే. నిత్యం ప్రయాణికులలో ఎవరో ఒకరు సంస్థపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నెట్టింట పోస్టులు పెడుతున్నారు. ఇప్పుడీ జాబితాలోకి శృతి హాసన్ కూడా వచ్చి చేరింది. ఇండిగో తీరుపై మండిపడుతూ నటి శృతి హాసన్ ట్విట్టర్ ఎక్స్ వేదికగా అసహనాన్ని వ్యక్తం చేసింది. ప్రయాణికులకు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఫ్లైట్ నాలుగు గంటల ఆలస్యం కావడంపై ఆమె గుస్సా అయ్యింది. ఫ్లైట్ ఆలస్యంపై ఆమె స్పందిస్తూ.. "నేను సాధారణంగా ఇలాంటి విషయాలలో సర్దుబాటు ధోరణితో ఉంటాను కానీ ఈసారి ఇండిగో మాత్రం మరీ ఇబ్బంది పెట్టేసింది. నాలుగు గంటలుగా మేము ఎయిర్‌పోర్టులో పడిగాపులు కాస్తున్నా.. ఫ్లైట్ ఇంతవరకూ బయలుదేరలేదు. ఇటువంటి విషయాల్లో క్లారిటీ ఇవ్వాలి. మరింత మెరుగైన విధానాలు అవలంబించాలి" అని పేర్కొంది. ఆమె ట్వీట్‌కు నెటిజన్లు కూడా మద్దతు పలుకుతున్నారు. 'ఇండిగో లో ఇలాంటివి కామన్.. ఈసారి ఇలాంటి ప్రయాణాలు చేయాల్సి వస్తే.. ఈ సంస్థను పక్కన పెట్టేయడం బెటర్', 'ఈ మధ్యకాలంలో ఈ సంస్థపై బాగా కంప్లయింట్స్ వస్తున్నాయి', 'వరస్ట్ సర్వీస్' అంటూ నెటిజన్లు రకరకాలుగా కామెంట్స్ చేస్తున్నారు. ఇక శృతి హాసన్ చేసిన పోస్టుకు ఇండిగో ఎయిర్‌లైన్స్ సంస్థ కూడా వెంటనే స్పందించి.. ప్రయాణికులు ఇబ్బంది పడ్డందుకు విచారం వ్యక్తం చేసింది. "మిస్ హాసన్ మీకు కలిగిన అసౌకర్యానికి మేము చింతిస్తున్నాము. ఫ్లైట్ ఆలస్యమైతే ఎంత ఇబ్బందో అర్థం చేసుకోగలం.

Edited, Printed, Published & Owned by Sri N.Chandra Shekhar, Printed at Laxmi Printers, D.No: 1-1-149/A, Gandhi Nagar, Kapra Mandal, Ecil, Medchal District. Telangana. Corporate Office : RamaKrishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India. Website: www.subhatelangana.in Gmail : subhatelangana@gmail.com Cell : 7799911110